Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 203 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 ఆగస్టు 2023 ఆదివారం పేజీలు : 4

### పంద్రాగస్టు వేడుకలకు 1800మంది ప్రత్యేక అతిథులు

న్యూఢిల్లీ : పంద్రాగస్టున దేశ రాజధానిలోని ఎర్రకోట వద్ద జరిగే వేడుకలకు పీఎం-కిసాన్ పథకం లబ్ధిదారులు సహా మొత్తం 1800మంది ప్రత్యేక అతిథులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి ఈ ఏడాదితో 75 ఏళు పూర్తవుతున్న సందర్భంగా గ్రామ సర్పంచులు, ఉపాధ్యాయులు, నర్సులు, రైతులు, మత్స్యకారులు, కార్మికులు, ఖాదీరంగ శ్రామికులు సహా అనే రంగాలవారిని ఆహ్వానించామని కేంద్ర వ్యవసాయ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త పార్లమెంటును నిర్మించిన కూలీలు, అమృత సరోవర్ ప్రాజెక్టులు, హర్ ఘర్‌జల్ యోజన ప్రాజెక్టుల్లో పాల్గొన్న పనివారితో పాటు పీఎం-కిసాన్ యోజన లబ్ధిదారులు 50మంది ఎర్రకోట వద్ద జెండా వందనంలో పాల్గొంటారని స్పష్టం చేసింది.

# 'సారు' ఇక జనాల్లోనే!

## సీఎం కేసీఆర్ క్షేత్రస్థాయి పర్యటనలు...



హైదరాబాద్: తెలంగాణలో మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కసరత్తులు చేస్తున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన ఆయన.. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో నేరుగా ప్రజల దగ్గరకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారని టాక్. శ్రావణ మాసం శుభప్రదమైనందని భావిస్తున్న కేసీఆర్.. శ్రావణం నుంచి జిల్లాల పర్యటన మొదలెట్టనున్నారని సమాచారం. జిల్లాల పర్యటనలో భాగంగా నేరుగా ప్రజల్లోకి వెళ్లి 9 ఏళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కేసీఆర్ వివరించనున్నారని తెలిసింది. ఇప్పటికే అమలవుతున్న పథకాల లబ్ధిదారులకు అవసరమైనవి పంపిణీ చేయడంతో పాటు.. కొత్త పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్తారని సమాచారం. కేసీఆర్ చివరిగా జూన్‌లో ఆసిఫాబాద్ బహిరంగ సభలో పాల్గొన్నారు. జులైలో నల్గొండ, సూర్యపేట, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించాల్సి ఉంది. కానీ భారీ వర్షాల కారణంగా ఆ పర్యటనలు రద్దయ్యాయి. మరోవైపు ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే అధికారిక కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉండదు. అందుకే అంతకంటే ముందే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంతో పాటు బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. బీసీ బంధు, గృహ లక్ష్మీ, మైనారిటీ బంధు, దళిత బంధు పథకాల లబ్ధిదారులకు కేసీఆర్ చేతల మీదుగా చెక్కులు అందించేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారని తెలిసింది.

# కాంగ్రెస్ లో చేరికలు, నాయకత్వానికి పరీక్ష

## సమన్వయం సాధ్యమేనా..!!



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. చేరికలు పెరుగుతున్నాయి. పలువురు సీనియర్లు ఎన్నికల వేళ గాంధీ భవన్ కు క్యూ కడుతున్నారు. మరి కొందరు ఎన్నికల వేళ ఎంట్రీ ఇచ్చేలా ముందస్తు మంతనాలు సాగిస్తున్నారు. కొత్తగా చేరుతున్న వారికి సీట్ల పైన హామీలు దక్కుతున్నాయి. ఇది పార్టీనే నమ్ముకొని ఇంత కాలం అంకితభావంతో ఉన్న నేతల్లో పలు సందేహాలకు కారణమవుతోంది. ఈ పరిణామాలు కాంగ్రెస్ నాయకత్వానికి పరీక్షగా మారుతున్నాయి. పెరుగుతున్న చేరికలు కాంగ్రెస్ చేరికల ప్రవాహం పెరిగింది. అధికారం ఖాయమంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారం ఇతర పార్టీలో కొందరు ముఖ్యులపైన ప్రభావం చూపుతోంది. కాంగ్రెస్ లో చేరేందుకు ముందుకొస్తున్నారు. ముఖ్య నేతలు తమతో పాటుగా తమ మద్దతుదారులకు సీట్ల పైన హామీలు పొందుతున్నారు. ఇది పార్టీనే నమ్ముకొని ఇంత కాలం అంకితభావంతో ఉన్న నేతల్లో పలు సందేహాలకు కారణమవుతోంది. ఇంత కాలం తమను ఇబ్బంది పెట్టిన నేతలు ఇప్పుడు తమ పార్టీలోకి రావటం పైన పలు చోట్ల సీనియర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వీరిని పార్టీ ఎలా సమన్వయం చేస్తుంది. సీట్ల విషయంలో అనుసరించే ఫార్ములా ఏంటి. ఎవరికి ప్రాధాన్యత దక్కుతుంది. ఇవ్వలేని వారికి ఎలా న్యాయం చేస్తుంది. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ లో ప్రధాన చర్చగా మారుతోంది.

**టికెట్లపై హామీలతో సమస్యలు...** పార్టీలో చేరికలను ప్రోత్సహించి..ప్రత్యర్ధి పార్టీలను దెబ్బ తీయాలని భావిస్తున్న కాంగ్రెస్ నాయకత్వం వచ్చే వారికి హామీలు గుప్పిస్తోంది. కొత్త వారు చేరికలు అవసరమే అయినా..పాత వారికి ఇచ్చే ప్రాధాన్యత ఏంటనేది ఇప్పుడు ప్రశ్నగా మారుతోంది. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్న సమయంలో పని చేసిన వారు తమ నియోజకవర్గాల్లో సీట్లపైన ఆశలు పెట్టుకున్నారు. ఆ నియోజకవర్గాల్లో కొత్త నేతలను చేర్చుకొనే క్రమంలో సీట్ల హామీలు ఇస్తుండటం వారికి రుచించటం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కొల్లాపూర్, నాగర్ కర్నూలు నియోజకవర్గాల్లో చేరికలపైన నాగం జనార్ధనరెడ్డి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. దామోదర్ రెడ్డి తన కుమారుడికి సీటు పైన హామీ కోరారు. అదే విధంగా రంగారెడ్డి జిల్లాలో మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరికకు సిద్దమయ్యారని తెలుస్తోంది. తన వర్గానికి సీట్లపైన హామీ దక్కినట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ పరిణామం జిల్లాలోని పార్టీ నేతలకు అంతుచిక్కటం లేదు. ఖమ్మం జిల్లాలో పాత, కొత్త నేతల మధ్య సీట్ల కోసం పోటీ నెలకొని ఉంది. పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం తిరిగి పార్టీలో చేరటం..సీటు పైన ఆశలు పెట్టుకున్నారు. అదే సమయంలో సీతక్క కుమారుడు అక్కడ చాలా కాలంగా ప్రచారం చేసుకుంటున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు ఖాయమయ్యాయి. ఈ సమయంలో వారికి ఇస్తున్న హామీలతో పార్టీనే నమ్ముకున్న నేతల్లో ఆందోళన కనిపిస్తోంది. కొత్త నేతలను చేర్చుకోవటం పైన అభ్యంతరం లేదంటున్న నేతలు, సీట్ల విషయంలో మాత్రం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిసి ఇప్పుడు ఎంట్రీ ఇస్తున్న వారి కంటే పార్టీని అంటిపెట్టుకున్న వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. పాత వారికి ఎక్కడా నష్టం లేకుండా, అదే సమయంలో కొత్త వారిని ఆకట్టుకొనేలా సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు టీ కాంగ్రెస్ ముఖ్య నేతల పైన ఉంది. ఇది నేతల సమర్ధతకు పరీక్షగా మారుతోంది.



## జోడు పదవుల్లో కిషన్ రెడ్డి.. బీజేపీ వ్యూహమేంటి?

తెలంగాణ బీజేపీ చీఫ్ గంగాపురం కిషన్ రెడ్డి రెండు పదవుల్లో కొనసాగనున్నారా మోదీ కేబినెట్‌లో సీటుకు డోకా లేదా? కేంద్రమంత్రిగానే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా? పార్టీ హైకమాండ్ వ్యూహమేంటీ? కిషన్ రెడ్డిని జోడు పదవుల్లో కొనసాగించడానికి కారణమేంటి?..

**అదనపు బాధ్యతలతో టైం మేనేజ్‌మెంట్‌లో ఇబ్బంది :** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అనుకోకుండా తెలంగాణ కాషాయ పగ్గాలు దక్కాయి.

ఎన్నికలకు టైం దగ్గరపడుతుంది. అటు కేంద్రంలో మూడు శాఖలకు మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అదనంగా పార్టీ రాష్ట్ర బాధ్యతలు అప్పగించడంతో టైం మేనేజ్‌మెంట్ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. పార్లమెంట్ సమావేశాల కారణంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గాన్ని, జిల్లా కార్యవర్గాలను, పార్టీ అనుబంధ విభాగాల పనితీరుపై సమీక్షలు చేసుకునే వెసులుబాటు కూడా దొరకలేదు. అటు ఢిల్లీ, ఇటు హైదరాబాద్ మధ్య నలిగిపోతున్నారు.

**ఎన్నికల వ్యూహం :** ఎన్నికల వేళ తెలంగాణలో అధికార పార్టీ నుంచి ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడానికి కిషన్ రెడ్డికి కేంద్ర మంత్రి పదవి సపోర్ట్‌గా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లిన సందర్భంలో కిషన్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. అధికార బీఆర్ఎస్‌పై పోరాటానికే ద్విపాత్రాభినయం కిషన్ రెడ్డి చేయనున్నారు. అదే వ్యూహంతో కాషాయ పార్టీ నేతలు వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నట్లు స్పష్టమవుతోంది. అందివచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోకుండా తెలంగాణలో పాగా వేయాలని కమలనాథులు లెక్కలు వేస్తున్నారు. కేంద్రమంత్రిగా ఉంటూనే కిషన్ రెడ్డి అంబర్ పేట అసెంబ్లీకి పోటీ చేయనున్నారు. మొత్తంగా జోడు పదవులతో ఎన్నికలకు వెళ్తున్న కిషన్ రెడ్డికి ఏ మేరకు మైలేజీ వస్తుందో చూడాలి.

# టిక్కెట్ మేమిస్తామంటే... మేమిస్తాం...!

## 'గద్దర్ సెంటిమెంటు' కోసం బీఆర్ఎస్ - కాంగ్రెస్ పోటీ

### గద్దర్ తనయుడు సూర్యంను తమవైపు తిప్పుకోవాలని తహతహ

హైదరాబాద్: గత నెలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, జిల్లాల పర్యటనలు, మహారాష్ట్ర టూర్ షెడ్యూలుతో బిజీగా గడిపిన ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల మూడో వారం నుంచి మళ్లీ క్షేత్ర స్థాయి పర్యటనలు మొదలు పెడుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతో పాటు ఈ ఏడాది చివరలో జరిగే ఎన్నికల సన్నద్ధతను మరింత వేగవంతం చేయాలని భావిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఈ నెల మూడో వారం నుంచి పాల్గొనే వరుస కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూలు సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టరేట్ సముదాయాలు, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాల ప్రారంభంతో పాటు బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటున్నారు. జూలైలో మరో ఐదు జిల్లాల్లో పర్యటించనున్నారు. సీఎం జిల్లాల పర్యటన షెడ్యూలును మరో రెండు రోజుల్లో ప్రకటించే అవకాశముందని సమాచారం. సీఎం పర్యటించే జిల్లాల జాబితాలో సూర్యాపేట, నల్లగొండ, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 15 తర్వాత సీఎం పర్యటన ఉండే అవకాశం ఉండగా, జిల్లా కలెక్టరేట్ సముదాయం, పార్టీ కార్యాలయంతో పాటు చనాకా-కొరాటా ప్రాజెక్టును ప్రారంభించే అవకాశముందని చెపుతున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోనూ కలెక్టరేట్ సముదా యంతో పాటు మెడికల్ కాలేజీని కేసీఆర్ ప్రారంభిస్తారని తెలుస్తోంది. సూర్యాపేట లేదా కోదాడలో బస చేసి మరుసటి రోజు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సభకు హాజరయ్యేలా సీఎం షెడ్యూలు ఉంటుందని తెలుస్తోంది. మెదక్, కరీంనగర్ జిల్లాల కలెక్టరేట్ సముదాయాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, నెలాఖరు లోగా ప్రారంభిస్తారని ఆ వర్గాలు తెలిపాయి.

**ఇతర జిల్లాల్లోనూ బహిరంగ సభలు :** జిల్లా కలెక్టరేట్ల ప్రారంభం లేని చోట కూడా బహిరంగ సభలు నిర్వహించే యోచనలో బీఆర్ఎస్ అధినేత ఉన్నట్లు పార్టీ వర్గాల సమా చారం. 2018 ఎన్నికల తర్వాత నారాయణపేట జిల్లాలో అడుగు పెట్టని సీఎం కేసీఆర్, ఈ జిల్లాలో త్వరలో పర్యటించే అవకాశముందని స్థానిక బీఆర్ఎస్ నేతలు చెపుతున్నారు. గత నెలలో మహారాష్ట్రలోని నాగపూర్, సోలాపూర్‌లలో పర్యటించిన కేసీఆర్.. త్వరలో పుణే లేదా భివండీలో సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోనూ పార్టీ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో అక్కడా సభల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పుణేలలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయా లను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నెల 8తో మహారాష్ట్రలో బీఆర్ఎస్ సభ్య త్వ నమోదు, సంస్థాగత కమిటీల ఏర్పాటు షెడ్యూ లు కొలిక్కి రానుంది. ఇప్పటికే 20 లక్షల మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నట్లు మహా రాష్ట్ర నేతలు వెల్లడించారు.

సంస్థాగత కమిటీల శిక్షణ కార్యక్రమానికి ఈ నెల 20 తర్వాత మహారాష్ట్రలో సీఎం పర్యటించే అవకాశ ముంది. ఏడాది చివరలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఈ నెల 18 లేదా 19న మంత్రులు, పార్టీ ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాష్ట్ర కార్యవర్గం, కార్పొరేషన్, జిల్లా పరిషత్ చైర్మన్లతో సమావేశం ఉంటుందని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.



# సంపాదకీయం

## సర్వే వాళ్ళకు పండగ టైం

సర్వేలు ఇపుడు తెలుగు రాష్ట్రాలలో సర్వ సాధారణం అయిపోయాయి. కోట్లాది మంది ప్రజల మనసులలో ఏమి ఉంది అన్నది తెలుసుకోవడానికి సర్వేలను నేతల దగ్గర నుంచి రాజకీయ పార్టీలు కూడా చేపడుతూ వస్తున్నాయి. సర్వేలతో ఎవరికి టికెట్ ఇవ్వాలి ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది అన్నది రాజకీయ పార్టీలు తమ కోణంలో తాము చేయించుకుంటూంటే సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ పరిస్థితి ఎలా ఉంది అన్న దాని మీద సర్వేలు సొంతంగా చేయించుకుంటున్న నేపధ్యం ఉంది. అలాగే ఆశావహులు కూడా సర్వేల మీద పడడమే ఇపుడు కొత్త పాయింట్. మొత్తం మీద చూస్తే ఏపీ రాజకీయాల్లో సర్వేరాయుళ్ల సందడి మామూలుగా లేదు. ఇక అధికార పార్టీ వైసీపీ తీసుకుంటే 2019 నుంచి పీకే టీం ని ఎంగేజ్ చేస్తూ వస్తోంది. ఆ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించడంతో మరోసారి పీకే టీం నే నమ్ముకుంది. ఆ టీం ఇచ్చే సర్వేల మీద అధికార పార్టీ పూర్తిగా ఆధారపడుతోంది. అదే టైం లో మరో రెండు మూడు ఏజెన్సీల ద్వారా కూడా వైసీపీ అధినాయకత్వం సర్వేలు చేయిస్తూ ఆ దిశగా తమ పార్టీ పరిస్థితిని అలాగే అభ్యర్ధుల పరిస్థితిని కూడా ఎప్పటికపుడు అంచనా వేసుకుంటూ వస్తోంది. ఇక తెలుగుదేశం పార్టీ కూడా సొంత సర్వేలతో పాటు తమకు అనుకూలంగా ఉన్న మీడియా ద్వారా సర్వేలను ప్రతీ క్షణం చేయించుకుంటూ వస్తోంది. అలాగే తెలుగుదేశం పార్టీ సైతం ఎన్నికల వ్యూహకర్తలను నియమించుకుంటూ వారిచ్చే సర్వేలను గ్రౌండ్ లెవెల్ లో రిపోర్టులను తీవ్రంగా పరిశీలన చేస్తూ అడుగు ముందుకు వేస్తోంది. మూడవ పార్టీగా ఏపీలో ఉన్న జనసేన కూడా సర్వేలు చేయిస్తోంది అని అంటున్నారు. ఇటీవల ఆ పార్టీ తమకు ఏపీలో ఉన్న వివిధ రీజియన్లలో ఎక్కడ బలం ఉంది, ఎక్కడ తమ పార్టీ గ్రాఫ్ పెరిగింది అన్న దాని మీద సంపూర్ణ నగ సర్వే చేయించుకుంది. దీంతో మూడు పార్టీలూ సర్వేలతో మునిగితేలుతున్నాయని చెప్పక తప్పదు. ఇపుడు ఈ సర్వేలు పార్టీలను దాటి ఎమ్మెల్యేలు నాయకుల దాకా పాకుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు కట్ అన్న వార్తలతో అప్రమత్తం అవుతున్న వారు అంతా సొంత సర్వేల మీద ఆధారపడుతున్నారు. తమ గురించి జనాలు ఏమి అనుకుంటున్నారు. గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ ఏంటి అన్న దాని మీద ఎమ్మెల్యేలు కీలక నేతలు కూడా ప్రైవేట్ సంస్థల ద్వారా సర్వేలను చేయించుకుంటున్న నేపధ్యం కనిపిస్తోంది. మరో వైపు చూస్తే ఆశావహులు కూడా సర్వేలు చేయించుకుంటున్నారు. అదేలా అంటే వారికి టికెట్ కావాలి. ఎన్నికల్లో పోటీ అంటే కోట్ల రూపాయల వ్యవహారం అని ప్రచారంలో ఉన్న మాట. దాంతో నెగ్గుతామని ధీమా ఉంటేనే రంగంలోకి దిగాలని భావిస్తూ ముందు చూపుతో ఈ సర్వేలు చేయించుకుంటున్నారు అని అంటున్నారు. ఇలా ఎవరికి వారు సర్వేలనే నమ్ముకోవడంతో తెలుగు రాజకీయాలలో సర్వేరాయుళ్ళకు మంచి రోజులు వచ్చాయని అంటున్నారు. ఒక విధంగా చూస్తే వారికి పండుగే వచ్చింది అని అంటున్నారు. సర్వేలు చేసే వారు క్షణం తీరిక లేకుండా ఫుల్ బిజీగా మారిపోయారు అని అంటున్నారు చేతినిండా పనితో పాటు కాసుల వర్షం కురుస్తోంది అని అంటున్నారు. ఇక సర్వేలను గతంలో బడా సంస్థలు చేసేవి. ఇపుడు చిన్న పాటి నెట్ వర్క్ ఉంటే చాలు ప్రతీ చోటా సర్వేలు చేసే వారు ఎక్కువ అయిపోయారు కొంతమంది నియోజకవర్గాల స్థాయిలో సర్వేలను చేయిస్తూ ఆయా రాజకీయ పార్టీలను అభ్యర్థులను ఆకట్టుకుంటున్నారు. ఏ సర్వే నిజం అన్నది పక్కన పెడితే ప్రతీ వారు జనం వద్దకు వచ్చి కొన్ని ప్రశ్నలతో వారి మనోభావాలను వెలికితీయాలని చూస్తున్నారు. కానీ సర్వేరాయుళ్ళ అంచనాలకు జనాల నాడి అందుతోందా అన్నదే ఇక్కడ కీలకమైన పాయింట్. ఏ గూటి పక్షి ఆ గూటి పలుకు పలుకుతుంది అన్నట్లుగా సర్వేలు కూడా చిలక పలుకులు పలుకుతాయా లేక గ్రౌండ్ లెవెల్ వాస్తవాలను బయటపెడుతున్నాయా అన్నదే ఇక్కడ మ్యాటర్ గా ఉంది. ఏది ఏమైనా సర్వేరాయుళ్ళకు మాత్రం ఫుల్ బిజీ గా ఉంది.

అనలైన వండుగ అపుడే స్టార్ట్ అయిపోయింది అని అంటున్నారు. ఇపుడే ఇలా గిరాకీ ఉంటే ఎన్నికలు ఇంకా దగ్గర పడుతున్న కొద్దీ సర్వేలకు మరింత పని పడుతుందని, దాంతో ఈ ఫీల్డ్ ని నమ్ముకున్న వారికి బిజీ వర్క్ తో తో పాటు కరెన్సీ కూడా బాగానే దక్కుతోందని అంటున్నారు.

# వ్యర్థానికి అర్థం చెప్పిన మరియపురం!



వరంగల్ : రైతులే కాదు.. పంచాయతీలు కూడా సేంద్రియ ఎరువు వర్మీ కంపోస్టు తయారుచేసి ఆదాయం పొందవచ్చని నిరూపించింది గీసుకొండ మండలం మరియపురం పంచాయతీ.. ఈ సేంద్రియ ఎరువు తయారీ, ఆదాయం పొందటంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ప్రక్రియను 2020లోనే పంచాయతీలో మొదలు పెట్టినప్పటికీ ఈ ఏడాదే అధిక ఆదాయం వచ్చిందని సర్పంచి బాలిరెడ్డి చెబుతున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ఉచిత మొక్కల పంపిణీతో పాటు, సేంద్రియ ఎరువును ఇస్తున్నామన్నారు. గ్రామంలో ఈ సేంద్రియ ఎరువును ఉపయోగించి ఎవరైతే ఎక్కువ కూరగాయలు పండిస్తారో వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి నగదు అందిస్తున్నామన్నారు. ఇది కేవలం వారిని ప్రోత్సహించడానికే అని తెలిపారు.

తయారీ ఇలా..!

గ్రామంలో మొదట ఇంటింటికీ తిరిగి పంచాయతీ వాహనం ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఇందులో గడ్డి, మొక్కల కొమ్మలు, ఆకులు, వంట గది వ్యర్థాలు, కుళ్లిపోయిన ఇతర ఆహార పదార్థాలను వేరు చేసి వర్మీ కంపోస్టుకు కేటాయించిన పెట్టెల్లో వేసి వాటిలో వాన పాముల్ని ఉంచుతారు. తడిగా ఉండటానికి పైన గన్నీ బస్తాలు పరచి అప్పుడప్పుడు నీటిని పోస్తుంటారు. ఇలా కనీసం 45 రోజులు గడిచాక సేంద్రియ ఎరువు తయారవుతుంది. తయారైన ఎరువు నుంచి వానపాముల్ని జల్లెడ పద్ధతి ద్వారా వేరు చేస్తారు. తర్వాత వర్మీ కంపోస్టును ఆరబెట్టి బస్తాల్లోకి ఎత్తుతారు. కేజీ ప్యాకెట్‌కి రూ.20, 25 కేజీల ప్యాకెట్ కి రూ.250 వసూలు చేస్తున్నామని సర్పంచి బాలిరెడ్డి తెలిపారు. ఈ ప్రకారం 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.35,600 ఆదాయం వస్తే. ఈఏడాది రూ.42,260 వచ్చిందని వివరించారు.

సోలార్ విద్యుదుత్పత్తికి అడుగులు

తాజాగా సోలార్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు అడుగులు వేస్తోంది. తాను సొంతంగా సమకూర్చే నిధులతోపాటు స్త్రీ నిధి రుణాలు, ప్రభుత్వం అందించే రాయితీతో గ్రామంలో ఇంటింటికి సోలార్ విద్యుత్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని సర్పంచి అల్లం బాలిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ విషయమై స్థానిక గ్రామపంచాయతీలో స్వయంసహాయక సంఘాల సభ్యులు, సెర్ప్ ఏపీఎం సురేష్, పంచాయతీ కార్యదర్శి ఎన్.స్వప్నతో శనివారం బాలిరెడ్డి చర్చించారు. గ్రామంలో 191 నివాస గృహాలు ఉండగా ఇందులో 248 కుటుంబాల వారు జీవిస్తున్నారు. 2కేవీ సోలార్ విద్యుత్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసుకోవడానికి రూ. 1.42.000లు ఖర్చవుతుండగా ప్రభుత్వం రూ. 39 వేలను రాయితీగా ఇస్తోంది. మిగితా రూ. 1.02,000లను లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉండగా ఈ డబ్బులను స్త్రీ నిధి ద్వారా మహిళలకు రుణంగా ఇస్తారు. ఈ రుణాన్ని 60 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది. గ్రిడ్‌ను ఏర్పాటు చేసుకోవడానికి 37 మంది ముందుకు వచ్చి దరఖాస్తులు చేసుకున్నారని సర్పంచి తెలిపారు. కాగా గ్రిడ్ కోసం దరఖాస్తులు చేసుకున్న ఒక్కొక్కరికి రూ. 10 వేలు తాను సొంతంగా ఇస్తానని అలాగే స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలను ఏడాదిపాటు సక్రమంగా చెల్లించిన వారికి ఏడాది తరువాత ప్రోత్సాహకంగా మరో రూ. 10 వేలు ఇస్తామని బాలిరెడ్డి ప్రకటించారు.

# స్థిరాస్తి వ్యాపారుల దందా



వరంగల్ : స్థిరాస్తి వ్యాపారులు కొందరు అక్రమ దందాకు తెరలేపారు. నిబంధనలకు తూట్లు పెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతూ.. కొనుగోలుదారులను బురిడీ కొట్టిస్తూ భారీగా దండుకుంటున్నారు. ఇదంతా అధికారులు కనుసన్నల్లో సాగుతుందంటే అతిశయోక్తి కాదు. చెన్నారావుపేటలో రియల్ వ్యాపారం అక్రమ మార్గాల్లో సాగుతోంది. లాభాపేక్షే ధ్యేయంగా నిబంధనలకు నీళ్లొదిలి ఎకరాల్లో భూములు కొనుగోలు చేసి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసి వాటిని ఇళ్ల స్థలాలుగా గజాల లెక్కన విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

చరవాణుల్లో చూపించి విక్రయాలు

లాభార్జనే లక్ష్యంగా స్థిరాస్తి వ్యాపారులు నాలా, లేఅవుట్ జోలికి వెళ్లకుండా ఎకరాల్లో భూములు కొంటూ పేపరుపై లేఅవుట్ చేసిన విధంగా ప్లాట్లు గీసి(బ్లూ ప్రింట్) వాటికి సంఖ్యలు వేసి చరవాణుల్లో నిక్షిప్తం చేసుకుంటున్నారు. ఈ ప్లాటు విస్తీర్ణం ఇన్ని గజాలు అంటూ చూపించి విక్రయించి మోసగిస్తున్నారు. సర్వేనంబరు 291లోని 2.31 ఎకరాల భూమిని స్థిరాస్తి వ్యాపారులు 34 ప్లాట్లు చేసి అమ్మకాలు జరుపుతున్నారు. ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులకు కలిపి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. పైపెచ్చు 3 గుంటలకు పట్టాదారు పాస్ పుస్తకం చేయించి ఇస్తామని రైతు బంధు, రైతు బీమా వర్తిస్తుందని కొనుగోలుదారులకు చెప్పడం విశేషం. స్థిరాస్తి వ్యాపారులు వారి పేరున వారి బంధువుల పేర్లతో ధరణిలో రిజిస్ట్రేషన్ చేసుకొని 3 గుంటలకు పట్టాదారు పాస్ పుస్తకాలను పొందారు.

లేఅవుట్ జోలికి వెళితే..

లేఅవుట్ చేయించాలంటే వ్యవసాయ భూమిని నాలా రుసుం చెల్లించి వ్యవసాయేతర భూమిగా మార్చాలి. ప్లాట్లు చేసేందుకు రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వ్యవస్థ, కరెంటు సౌకర్యం కల్పించాలి. మొత్తం విస్తీర్ణంలో పది శాతం గ్రీన్‌ల్యాండ్‌ను పంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేసి జిల్లా పట్టణ కంట్రీ ప్రణాళిక విభాగానికి దరఖాస్తు చేయాలి. ఇవేగాక వెంచర్‌లో అభివృద్ధి కోసం వారడిగిన భూమిని పంచాయతీ పేరుతో మ్యుటేషన్ చేయాల్సి ఉంటుంది. ఇదేగాక నిబంధనలకు లోబడి రుసుం చెల్లించాలి. అన్ని పనులు కావడానికి కొంత సమయం పడుతుంది. ఎందుకొచ్చిన తంటా అని ధరణిలో ఉన్న లొసుగులను ఆసరగా చేసుకొని లేఅవుట్ లేకుండా ఇళ్ల స్థలాలుగా చేసి అమ్మి లాభాలు గడిస్తున్నారు. భవిష్యతులో ఇంటి నిర్మాణం చేస్తే నాలా మార్పిడి చేసుకోవాల్సిన బాధ్యత కొనుగోలుదారుడే అవుతుంది.

నాలా కోసం దరఖాస్తులు రాలేదు– బన్సీలాల్, తహసీల్దార్, చెన్నారావుపేట

చెన్నారావుపేటతోపాటు గ్రామాల నుంచి నాలా మార్పిడి కోసం తమ కార్యాలయానికి ఎలాంటి దరఖాస్తులు రాలేదు.

'నాలా' లేకుండానే

వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలుగానో, పరిశ్రమలకనో వినియోగిస్తే నిబంధన మేరకు మొదట దానిని వ్యవసాయేతర భూమిగా(నాలా) మార్పిడి చేయించాలి. చెన్నారావుపేటలో స్థిరాస్తి వ్యాపారులు నాలా మార్పిడి లేకుండా సేద్యపు భూములు కొని ఇళ్ల స్థలాలుగా గజాల చొప్పున విక్రయించి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సర్వే నంబరు 291లో 2.31 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన వ్యాపారులు నాలా మార్పిడి చేయకుండానే ఇళ్ల స్థలాలు (ప్లాట్లు)గా అమ్ముతున్నారు. వ్యాపారులు ఇచ్చే నజరానాలతో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

# సమస్యలివీ.. పరిష్కారమేది?

వరంగల్ : 29వ డివిజన్ వరంగల్ రామన్నపేట, పాపయ్యపేట దళితుల శ్మశానవాటికలో పిచ్చి చెట్లు నిండి అపరిశుభ్రత నెలకొంది. కాలు పెట్టే సంధు లేదు. తుమ్మ చెట్లు ఏపుగా పెరిగాయి. నీటి వసతి, లైటింగ్ వసతుల్లేవు. సుమారు 350 కుటుంబాలకు ఉపయోగ పడే శ్మశానవాటికను బాగు చేయాలని పదుల సార్లు వినతులు అందజేశారు. ఎంతో దూరం నుంచి వచ్చి సమస్యలు పరిష్కరించాలని, కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని పదులసార్లు వినతి పత్రాలు ఇచ్చాం.. చూద్దాం.. చేద్దామనడం తప్ప సమస్యలు పరిష్కారానికి మహా నగర పాలక సంస్థ అధికారులు చొరవ చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. పరిష్కారం చూపని ప్రజావాణి కార్యక్రమం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రజావాణిలో వచ్చిన కాలనీల సమస్యలపై బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇస్తున్న కథనం. కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వల్లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానవాటికలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు.

25సార్లు వినతిపత్రాలిచ్చాం..– సింగారపు బాబు, పాపయ్యపేట, రామన్నపేటపాపయ్యపేటలో 350 కుటుంబాలకు ఉపయోగపడే దళితుల శ్మశానవాటిక దుస్థితి దయనీయంగా ఉంది. రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. తుమ్మ, ఇతర చెట్లు ఏపుగా పెరిగాయి. పాములు ఎక్కువగా ఉన్నాయి. నాలుగేళ్లలో 25 సార్లు వినతి పత్రాలు ఇచ్చినా, అధికారులు పట్టించుకోవడం లేదు.

నిరసనలు, నిలదీతలు!మహా నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి నిరసనలు నిలదీతలకు వేదికైంది. వరంగల్ 29వ డివిజన్ ఓ.ఎన్.నగర్, రఘునాథ్ కాలనీ, పాపయ్యపేట కాలనీల సమస్యలు పరిష్కరించాలని, దళితుల శ్మశానవాటిక బాగు చేయాలని కోరుతూ కేవీపీఎస్ నాయకులు సమావేశ మందిరంలో బైఠాయించారు. అరగంటపాటు నిరసన తెలిపారు. మొత్తం 72 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజినీరింగ్ 12, టౌన్‌ప్లానింగ్ 38, పన్నులు 11, ప్రజారోగ్యం 04, తాగునీటి సరఫరా 06, వీధిదీపాలు 01 వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో స్మార్ట్‌సిటీ సమావేశానికి కమిషనర్ ప్రావీణ్య వెళ్లారు. అదనపు కమిషనర్ రవీందర్‌యాదవ్, ఉపకమిషనర్లు రష్మీద్, జోనా, ఎస్‌ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ జ్ఞానేశ్వర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, బయాలజిస్టు మాధవరెడ్డి తదితరులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. హనుమకొండ భగత్‌సింగ్‌నగర్, పెద్దమ్మగడ్డ, కాజీపేట ప్రశాంత్‌నగర్ కాలనీల ప్రజలు సమస్యలపై అధికారులను నిలదీశారు. పదులసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు.కాశీబుగ్గ–ఎనుమాముల శివారులో సాయిగణేశ్ కాలనీ ఉంది. 150 కుటుంబాలుంటాయి. వర్షాకాలం వచ్చిందంటే మోకాళ్లలోతు నీళ్లు ఆగుతాయి. మురుగు కాల్వలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కాలనీ కమిటీ ప్రతినిధులు 10 సార్లు వినతి పత్రాలు సమర్పించారు.

# స్వచ్ఛత చాటాలి

సూర్యాపేట : పురపాలికల్లో స్వచ్ఛత చాటడానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు నిర్వహిస్తోంది. గతంలో అన్ని విభాగాలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌తోనే మార్గదర్శకాలు, మార్కులు కేటాయించేది. ప్రస్తుతం ఒక్కో విభాగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పటిష్ఠ ప్రణాళికతో ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగానే మరుగుదొడ్ల పరిశుభ్రత నిర్వహణపై టాయిలెట్స్ 2.0 ప్రోగ్రాం రూపొందించారు. పురపాలికలు ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రజాభిప్రాయ సేకరణ సాగుతోంది. హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది. దీంతో ప్రజాభిప్రాయ సేకరణపై దృష్టి సారిస్తోంది.

మార్కుల కేటాయింపు ఇలా


పురపాలికల్లో స్వచ్ఛ భారత్ మిషన్ అభియాన్ ఆధ్వర్యంలో టాయిలెట్స్–2.0 కార్యక్రమాన్ని చేపట్టింది. సామాజిక, ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటు, నిర్వహణ తీరును మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మూడు విభాగాల్లో 240 మార్కులుబట్టి సూచికల ఏర్పాటు, యాప్ నమోదులో తదితర అంశాలకు మరో 20 మార్కులుంటాయి. పురపాలికల్లో వీటిని వృద్ధి చేస్తూ ప్రజలకు అందుబాటులోకి తెస్తూ నిర్వహణ తీరును మెరుగుపర్చడమే టాయిలెట్స్–2.0 లక్ష్యం. ఈ మేరకు పురపాలికల్లో మరుగు



దొడ్లలో అవసరమైన సదుపాయాలు కల్పించడంతోపాటు నిర్వహణను మెరుగు పరుస్తున్నారు. కమిషనర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా ప్రజాభిప్రాయ సేకరణపై దృష్టి సారించారు. మరుగుదొడ్లలోని సదుపాయాలు, నిర్వహణ తీరుపై 24 ప్రశ్నలకు టాయిలెట్స్ 2.0 లో ప్రజలు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. జనాభాలో ఒక శాతం ప్రజల అభిప్రాయాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంది. ఉదాహరణకు సూర్యాపేట పురపాలికలో 1.40 లక్షల జనాభా ఉంది. ఒక శాతం అంటే 1400 మంది అభిప్రాయాలను నమోదు చేయాల్సి ఉంది. దీంతో పురపాలికలు 260 మార్కులను పొందొచ్చు. వీటి ప్రకారం పురపాలికలకు ర్యాంకులు కేటాయిస్తారు.

# రోడ్డెక్కితే ఇబ్బందే!

ఖమ్మం : ప్రతి 700 వాహనాలకు ఒక ట్రాఫిక్ సిబ్బంది ఉండాలనేది పోలీసు పరిశోధన అభివృద్ధి మండలి(బీపీఆర్‌డీ) లెక్క. దీని ప్రకారం ఖమ్మం జిల్లాలో 655 మందికి పైగా పోలీసు సిబ్బంది అవసరం.ప్రతి 700 వాహనాలకు ఒక ట్రాఫిక్ సిబ్బంది ఉండాలనేది పోలీసు పరిశోధన అభివృద్ధి మండలి(బీపీఆర్‌డీ) లెక్క. దీని ప్రకారం ఖమ్మం జిల్లాలో 655 మందికి పైగా పోలీసు సిబ్బంది అవసరం. ప్రస్తుతం 141 (హోంగార్డులతో కలుపుకొని) మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది కొరత ప్రజల ప్రయాణ సౌకర్యానికి తీవ్ర విఘాతంగా పరిణమిస్తోంది. ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్, కస్పాబజార్, రైల్వేస్టేషన్ రోడ్డు, బాలాజీనగర్, వైరారోడ్డు, లెనిన్‌నగర్, బస్సుడిపో రోడ్డు, నెహ్రూనగర్, చర్చికాంపౌండ్, జోనకల్ రోడ్డు, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, కాల్వొడ్డు, గాంధీచౌక్ తదితర ప్రాంతాలు నిత్యం వాహనాలతో కిక్కిరిసిపోతాయి. పనేవేలు ఏర్పాటు చేయకపోవడం, అక్కడక్కడ ఇరుకురోడ్లతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఖమ్మం నగరం విస్తీర్ణం దృష్ట్యా మరో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కేంద్రాలు రోజురోజుకూ శరవేగంగా విస్తరిస్తున్నాయి. ప్రజలు తమ అవసరాల దృష్ట్యా అదేస్థాయిలో వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. వీటిలో ద్విచక్రవాహనాలు, కార్లు అత్యధికంగా ఉంటున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల ఇరుకురోడ్లు పట్టణవాసుల ప్రయాణాన్ని ఇబ్బందికరంగా మారుస్తున్నాయి. రోడ్లపై వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు సైతం తగిన సంఖ్యలో లేకపోవడం గమనార్హం.



ప్రధాన కూడళ్లలోనూ కానరాని సిబ్బంది

అక్కడక్కడ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం అనే విషయాన్ని ట్రాఫిక్ సిబ్బంది మర్చిపోయారనే వాదనలు వినిపిస్తున్నాయి. నిత్యం ఫొటోలు తీసి ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేసి జరిమానాలు విధించడానికే యత్నిస్తున్నారు తప్ప ట్రాఫిక్‌పై దృష్టి సారించటం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. కొన్ని ప్రధాన కూడళ్లలోనూ ట్రాఫిక్ సిబ్బంది కానరావటం లేదు. ఖమ్మం నగరంతో పాటు ఇతర మండలాలు, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌ను సివిల్ పోలీసులు క్రమబద్ధీకరిస్తుండటం విశేషం.

రాకపోకలకు తీవ్ర విఘాతం

కొత్తగూడెం, భద్రాచలంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. ఇక్కడా వాహనాలకు తగినట్లుగా సిబ్బంది లేరు. వాహనాల క్రమబద్ధీకరణలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు. భద్రాద్రి జిల్లాలో వాహనాలకు తగినట్లు 252 మంది సిబ్బంది అవసరం. ప్రస్తుతం 50 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచలో ట్రాఫిక్ నియంత్రణ కష్టంగా మారుతోంది. భద్రాచలంలో శ్రీసీతారామస్వామి ఆలయం వద్ద వీఐపీలు, భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది.

# పరిష్కారం.. పరేషన్

కరీంనగర్: రేషన్ బియ్యం పంపిణీకి కొత్త సమస్య అడ్డొస్తోంది. ఇన్నాళ్లు గన్నీ సంచుల బరువుకు తగిన బియ్యం ఇవ్వాలని పట్టుబట్టిన డీలర్లకు ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించింది. ఆ పరిష్కారమే బియ్యం పంపిణీకి ఆలస్యానికి కారణమవుతోంది.

ఇదీ పరిస్థితి

ఒక యాభై కిలోల బియ్యం బస్తాను తీసుకొంటే గన్నీ సంచి బరువు 580 గ్రాములను మినహాయించుకొని తూకం వేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. ఆ మార్పు ఇప్పుడు సమస్యగా మారింది. 50 కిలోల బస్తాలను తూకం వేసినపుడు బాగానే ఉంది కానీ.. అంతకు మించి ఎక్కువ లేదా తక్కువ కిలోలను లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా తూకం వేయాల్సి వచ్చినప్పుడు సంచి బరువు 580 గ్రాముల



మినహాయింపు పద్ధతి సమస్యగా మారుతోంది. సాధారణ తూకం యంత్రంలో ఎక్కువ, తక్కువ తూకం వేసే అవకాశం ఉంటుంది కానీ.. ఆ అవకాశం లేకుండా ఎంఎల్ఎస్ పాయింట్లలోని తూకం యంత్రాలు. ఈ పాస్ యంత్రాలతో అనుసంధానమయ్యాయి. దీంతో సమస్య ఉత్పన్నమవుతుండగా.. దాన్ని అధిగమించడానికి రెండ్రోజులుగా అధికారులు తంటాలు పడుతున్నారు. ఫలితంగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి దుకాణాలకు రేషన్ బియ్యం రవాణా ఆలస్యమవుతోంది.

సగం స్టాక్ చేరలే..బయోమెట్రిక్‌తో డీలర్లకు స్టాక్ పంపిణీ ఆలస్యమవుతుందని ప్రభుత్వం ముందే అంచనాకు వచ్చింది. ప్రతినెలా లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీని 5 నుంచి 10వ తేదీకి పొడిగించింది. పంపిణీని వాయిదా వేసినా కొత్తగా వచ్చిన సాంకేతిక సమస్య బియ్యం స్టాక్ దుకాణాలకు చేరవేయడానికి అడ్డంకిగా మారింది. ప్రభుత్వం విధించిన గడువు నేటితో ముగుస్తున్నా.. దుకాణాలకు ఇంకా సగం స్టాక్ చేరకపోవడం గమనార్హం.

# హోర్డింగులు దండి.. ఆదాయానికి గండి!

కరీంనగర్: కరీంనగర్ కార్పొరేషన్‌లో విచ్చలవిడిగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారని.. వాటి ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడుతోందని ఓ సామాజిక కార్యకర్త గత నెల 10న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రచారాలతో నగరపాలక సంస్థకు రావాల్సిన రాబడి విషయంలో నిర్లక్ష్యమే కనిపిస్తోందని.. 2022-23 వార్షిక సంవత్సరానికి సంబంధించి హోర్డింగ్‌ల నిర్వాహకుల్లో ఒకరు రూ.27,58,508 పన్ను రూపంలో చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం రూ.3 లక్షలే చెల్లించి మిగతా సొమ్ము చెల్లించకుండా ఎగవేతకు పాల్పడ్డాడని వినతిలో పేర్కొన్నారు. ఇలా నగరంలో పలు హోర్డింగ్‌లకు రుసుముని సక్రమంగా వసూలు చేయడం లేదని.. ఇలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, రికవరీ చేసిన సొమ్మును ఖజానాకు జమ చేయాలని విన్నవించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చిన్నవి, పెద్దవి కలిపి దాదాపుగా 2 వేలకుపైగా ప్రచార సూచికలు పెద్ద పెద్ద భవనాలపై ఏర్పాటు చేశారు. ఇందులో నిబంధనల ప్రకారం ఉన్నవి సగం మాత్రమే కాగా, మిగతావన్నీ ఇష్టానుసారంగా ఏర్పాటు చేసుకున్నవే.! చాలాచోట్ల భవనాలపై ఉన్న వాటి ఎత్తు పరిమాణం కొలతలను బల్దియా అధికారులు సేకరించలేదు. వీటి విషయంలో పుర, నగరపాలక సంస్థల్లోని అధికారులు పూర్తిగా నిర్లక్ష్యాన్ని వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు. చాలాచోట్ల శిథిల భవనాలపై 15-20 టన్నుల ఇనుప ఊచలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. నిర్ణీత ఎత్తుని మించి నిర్మిస్తూ.. నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నారు. వర్షాకాలంలో ఈదురు గాలుల వల్ల ఇలాంటివి కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. లెక్కాపత్రం లేనే లేదు..! : కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థతోపాటు మరో 14 పురపాలికల్లో దాదాపుగా 15 రకాల ప్రచార సూచికల్ని ఏర్పాటు చేస్తున్నారు. యూనిపోల్స్, సెంట్రల్ డివైడర్స్, సైన్‌బోర్డ్స్. లాలిపాప్స్, స్లైడ్స్ సహా ఇతరత్రాలుగా ఏర్పాటు చేసే వాటి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. చదరపు అడుగుకు ఇంత చొప్పున ధరల్ని నిర్ణయించి గుత్తేదారు వసూలు చేయడంతోపాటు ఒప్పందం ప్రకారం బల్దియాకు పన్నును చెల్లిస్తుంటారు. ఈ విషయంలో అన్నిచోట్ల లెక్కా పత్రం సరిగ్గా ఉండటం లేదు. అసలు ఉన్న వాటిలో సగం వాటికి పన్నును సక్రమంగా వసూలు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రతి ఆర్థిక సంవత్సరంలో వీటి ద్వారా సుమారుగా రూ.10-16 కోట్ల ఆదాయం సమకూరాల్సిన చోట ఇందులో సగం కూడా వసూలవడం లేదని బల్దియాల్లోనే చర్చ జరుగుతోంది. శతశాతం వసూళ్ల పురోగతి ఏ ఒక్క చోట లేదు. పైగా యాడ్ ఏజెన్సీల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, లావాదేవీల నిర్వహణ పక్కాగా కొనసాగించే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని చూపిస్తున్నారు. రాబడిలో కనీసం 50శాతం వసూళ్లు ఏ ఆర్థిక సంవత్సరంలో కనిపించడం లేదు. దీంతో బకాయిలు పెరుగుతుండటం, నోటీసులు ఇస్తున్నా వారి నుంచి స్పందన కరవవడంతో లక్షలాది రూపాయల్ని ఇట్టే వదిలేస్తున్నారు. అధికారులు, పాలకవర్గాలు మారుతుండటంతో ఏజెన్సీల వాళ్లు పాత కథను అక్కడితో వదిలేసి.. కొత్త పేర్లతో మళ్లీ ప్రచార హక్కులను దక్కించుకుంటున్నారు.

ఇవీ నిబంధనలు

నిబంధనల్ని అతిక్రమించిన హోర్డింగ్ యజమానికి, గుత్తేదారుకు జరిమానా విధించే హక్కు బల్దియాలకున్నా.. ఏ ఒక్క చోటా ఇది అమలు చేయలేదు. రోడ్ల పక్కన నేల నుంచి 15 అడుగుల ఎత్తులో అనుమతి లేకుండా కటౌట్లు, సూచిక బోర్డును ఏర్పాటు చేయొద్దు.! చేస్తే రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా వేయొచ్చు. గాలుల వల్ల విరిగి పడినా. జనావాసాల మధ్య పడకుండా ఉన్న ప్రాంతాల్లోనే హోర్డింగ్‌లకు అనుమతివ్వాలి. కచ్చితంగా బల్దియాల అనుమతి ఉండాలి. విద్యుత్తు టవర్లు, హైటెన్షన్ లైన్లకు దగ్గరగా వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయకూడదు. అనుమతి మంజూరు చేసేటప్పుడే అన్నింటినీ గమనించాలి. సంబంధిత అధికారులు విద్యుత్తు, అగ్నిమాపక అధికారుల నుంచి కూడా నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకున్న తరువాతనే ఆమోదముద్ర వేయాలి. ప్రధాన రహదారుల పక్కన భవనాల విషయంలో జాగ్రత్తలు వహించాలి.

# యంత్రాల పరుగులు.. వేగంగా పనులు



భూపాలపల్లి : భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగగా.. ప్రస్తుతం బొగ్గు వెలికితీతకు యంత్రాలు, రవాణా వాహనాలు పరుగులు పెడుతున్నాయి.. ఉత్పత్తి పుంజుకుంటోంది. కుంభవృష్టి వానలతో సింగరేణి వ్యాప్తంగా ఉపరితల గనుల్లో రెండు మిలియన్లకు పైగా ఉత్పత్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే.. వర్షం ఆగిపోవడంతో క్వారీల్లోకి వాహనాలు వెళ్లేందుకు రహదారులు చదును చేశారు. దీంతో యంత్రాలు క్వారీల్లోకి సులువుగా వెళ్లడానికి మార్గం సుగమమైంది. ఉత్పత్తి మొదలైంది. మరోవైపు గనుల్లోకి చేరిన నీటిని భారీ సామర్థ్యం గల పంపుల ద్వారా ఉపరితలానికి పంపిస్తున్నారు.

రూ.22 కోట్లు నష్టం

వర్షాల మూలంగా ఓసీపీల్లో రోజుకు 1.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. ఒక్కోరోజు అసలు మొత్తానికే ఉత్పత్తి చేపట్టని పరిస్థితులు తలెత్తాయి. భారీ వర్షాలతో క్వారీలన్నీ జలమయమయ్యాయి. దీంతో డంపర్లు, షావల్స్, డోజర్లు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. భారీ వర్షానికి క్వారీల్లోకి నీరు చేరడంతో పాటు రహదారులు బురదమయంగా మారాయి. సింగరేణి వ్యాప్తంగా 19 ఉపరితల గనుల్లో వర్షాలకు ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే ఉత్పత్తి దశలోకి తీసుకురావాలని ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలో దాదాపు రూ.22 కోట్ల నష్టం వాటిల్లింది.

పెరిగిన డిమాండ్

కొద్ది రోజులుగా వినియోగదారులకు సరిపడా బొగ్గు రవాణా చేయలేకపోవడంతో వినియోగదారుల నుంచి ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో క్రమంగా ఉత్పత్తి తిరిగి పెంచుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. యంత్రాలు విరామం లేకుండా పనిచేయడంతో పాటు అవసరమైన నిర్వహణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ఉపరితల గనుల అధికారులు, మేనేజర్లు ప్రత్యేకంగా ఉత్పత్తిపై దృష్టి సారించారు. నిల్వలు కూడా పూర్తికావడంతో ప్రస్తుతం ఉత్పత్తి పెంచుతున్నారు.

రవాణాకు ఆటంకం లేకుండా..

ఉత్పత్తి చేసిన బొగ్గు వినియోగదారులకు రవాణా చేసేందుకు రోడ్డు, రైలు మార్గాలకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లారీలు, రైలు వ్యాగన్ల ద్వారా బొగ్గు రవాణా చేసేందుకు సంప్రదింపులు చేస్తున్నారు. సకాలంలో వ్యాగన్లను సమకూర్చాలని అధికారులతో సమన్వయం చేస్తున్నారు. ప్రధానంగా సీహెచ్‌పీల నుంచి బొగ్గు రవాణా చేస్తారు.

# గూడుకట్టిన అక్రమాలు!



భూపాలపల్లి : భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో ఇంటి నెంబర్ల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం.. ఏ స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారో ఆ స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతి ఉంటేనే ఇంటి నెంబర్ కేటాయిస్తారు. కానీ, ఇక్కడ కొన్నేళ్లుగా అసలు ఇళ్లు లేకున్నా ఇంటి నంబర్లు కేటాయించటం పరిపాటిగా మారింది. ఆరేడేళ్లుగా ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతోంది. నివాసం ఉండని ఇళ్లకు సైతం పురపాలక సంఘం పరిధిలో అధికారులు ఇంటి నంబర్లు కేటాయించడం అక్రమాలకు పరాకాష్టగా మారింది.

జిల్లాలోని ఏకైక మున్సిపాలిటీ భూపాలపల్లి పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. బొగ్గు గనుల తవ్వకాలు, అతి సమీపంలోనే విద్యుదుత్పత్తి కేంద్రం ఉండటంతో ఇతర జిల్లాల నుంచి వందల సంఖ్యలో నిరుద్యోగులు, వ్యాపారులు, కార్మికులు ఉపాధి నిమిత్తం ఇక్కడికి వలస వచ్చి స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వివిధ కార్మిక కాలనీల్లో ఖాళీ నివాస స్థలాల్లో కొత్త గృహాలు విస్తరిస్తున్నాయి. మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం మొత్తం 12,186 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంటికి నెంబర్ ఉంటేనే ఆ ఇంటికి విద్యుత మీటరు మంజూరు, గ్యాస్ సిలిండర్, తాగునీటి నల్లా వంటి వసతుల సమకూరుతాయి. ఈ క్రమంలోనే కొందరు ప్రభుత్వ భూములు, వివాదాస్పద, కోర్టు కేసుల్లోని భూముల్లో నిర్మించుకుంటున్న ఇళ్లకు దర్జాగా ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి, బదిలీపై వెళ్లిన ఓ అధికారి అసలు ఇళ్లే లేకున్నా ఇంటి నెంబర్లు కేటాయించినట్లు ఆరోపణలున్నాయి. కొందరు దళారులు ఈ వ్యవహారంలో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఎందుకు తీసుకుంటున్నారంటే..

ఇంటి నెంబరు అనేది ఒక హక్కు.. ఖాళీ నివాస స్థలం ఉంటే ఎవరైనా అదే స్థలానికి తప్పుడు సర్వే నెంబర్ల పేరుతో నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తారనే భయంతోనే కొందరు ఆ నివాస స్థలం చుట్టూ ప్రహరీ, చిన్న రేకులతో షెడ్ నిర్మించుకొని ఇంటి నెంబరు పొందుతున్నారు. ప్రభుత్వ భూములు, చెరువు శిఖంలో అక్రమంగా ఇళ్లు నిర్మించకుని ఇంటి నెంబరు సంపాదిస్తే.. మున్సిపాలిటీకి ఇంటి పన్ను చెల్లిస్తున్న పత్రాల ఆధారంగా కోర్టుకు వెళ్తే న్యాయం జరుగుతుందని కొందరు ఎత్తుగడ వేస్తున్నారు. కొద్ది నెలల క్రితం ఓ కార్మిక కాలనీలో అసలు ఇళ్లు లేకున్నా ఆరు షెడ్‌ల పేరుతో ఎలా ఇంటి నెంబర్లు కేటాయించారంటే ఏ మేరకు ఈ దందా కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు.. కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిడి కారణంగా అధికారులు, సిబ్బంది మామూళ్లు పుచ్చుకుని కేటాయిస్తున్నారనే విమర్శలున్నాయి.

నిబంధనలు ఇవీ..

భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, కోర్టు కేసుల్లో లేకుండా ఉన్న స్థలాల్లో ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయిస్తారు. అనంతరం విద్యుత్తు మీటరు, తాగునీటి నల్లా కనెక్షన్ పొందవచ్చు. ఇంటి నంబరు కేటాయించే ముందు ఇంటి విస్తీర్ణం.. ఖాళీ స్థలం ఎంత ఉంది....? కిటికీలు, దర్వాజలు ఎన్ని..? రేకుల షెడ్ ఉందా భవనమా...? అనేది తెలుసుకున్న తర్వాతనే కేటాయించి, ఆస్తి పన్ను విధించాల్సి ఉంటుంది.

మచ్చుకు కొన్ని..

పట్టణంలోని కృష్ణా కాలనీలో సింగరేణి కార్మిక కుటుంబాలకు గతంలో పంపిణీ చేసిన నివాస స్థలాలు 30 వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇంటి స్థలాలు తీసుకున్న వారికి సింగరేణి సంస్థ నిర్మించిన క్వార్టర్లు కేటాయించరనే ఉద్దేశంతో కొందరు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేదు. కొద్ది నెలల క్రితం ఇలాంటి స్థలాలకు ఇంటి నెంబర్లు పొంది, వాటిని ఇతరులకు విక్రయించినట్లు తెలిసింది.

మంజూరునగర్ ప్రాంతంలో ఓ రియల్టర్ దాదాపు 15 ఎకరాలకు పైగా ప్లాట్లుగా విభజించి అమ్మకాలు కొనసాగించగా, కొందరు ఉద్యోగులు,

కార్మికులు ఆ నివాస స్థలాలను కొనుగోలు చేసుకున్నారు. అప్పటి ఆర్థిక పరిస్థితుల కారణంగా కొందరు రిజిస్ట్రేషన్లు చేసుకోలేదు. వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన రియల్టర్ 'నాలా' మార్పిడి చేయలేదు. దీంతో ఆ రైతు, కుటుంబ సభ్యులు కలిసి మరికొందరికి ఆ భూములు రిజిస్ట్రేషన్ చేశారు. ఇరువర్గాలు పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ ప్రాంతంలో అసలు ఇళ్లు లేకున్నా దాదాపు పదుల సంఖ్యలో మున్సిపాలిటీ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించడం విశేషం.

బొగ్గు తవ్వకాల కోసం సింగరేణి యాజమాన్యం రిక్వెషన్ పెట్టుకున్న భూముల్లో ఎలాంటి ఇంటి నిర్మాణాలకు అనుమతి ఉండదు. కానీ, ఇక్కడ సింగరేణి సంస్థ నుంచి నష్టపరిహారం పొందడానికి వందల సంఖ్యలో నాలుగేళ్ల క్రితం కొత్త ఇళ్లు నిర్మించారు. ఇలాంటి ఇళ్లకు ఇంటి నంబర్లు లేకుంటే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం మంజూరు కాదనే ఉద్దేశంతో అప్పట్లో ఓ అధికారి 60 పైగా ఇంటి నెంబర్లు కేటాయించారు. అటు సింగరేణిని మోసం చేయడమే కాకుండా లక్షలాది రూపాయల ప్రజాధనం నష్టపరిహారం పొందడానికే అక్రమంగా ఇంటి నెంబర్లు ఇచ్చారు.

చట్టవిరుద్ధమే..

– భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

ఇల్లు లేకుండా ఇంటి నెంబర్ కేటాయించటం చట్ట విరుద్ధమే అవుతుంది. నేను ఆర్ఐగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఎలాంటి అక్రమాలకు ఆస్కారం ఇవ్వలేదు. అయినా గతంలో ఇళ్లు లేకున్నా ఎన్ని ఇంటి నెంబర్లు ఇచ్చారనే విషయంపై పూర్తిగా విచారించి, పై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# లోపల డిజిటల్ తెర.. మూసేస్తే గ్రీన్‌చాక్ బోర్డు

ములుగు : ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతి కొత్త పుంతలు తొక్కుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచుతోంది. ఇందులో బాగంగా మన ఊరు మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులతో పాటు డిజిటల్ తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. ఎంపికైన అన్ని పాఠశాలల్లో డిజిటల్ తెరలు, గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. అన్ని సబ్జెక్టులను డిజిటల్ తరగతుల నిర్వహణ ద్వారా బోధించేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు రెండు రకాలుగా పాఠాలు బోధించేలా బోర్డు సిద్ధం చేశారు. డిజిటల్ తరగతులు ముగిసిన తర్వాత తెరను మూసేసి దానిపైన అమర్చిన గ్రీన్ చాక్ బోర్డుపై పాఠాలు బోధించే విధంగా స్లైడ్ పద్ధతి అనుసరిస్తున్నారు. డిజిటల్ తెరపై తరగతులు నిర్వహించిన తర్వాత విద్యార్థికి పాఠాలు మరింత అర్థమయ్యేందుకు సందేహాలు నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయుడు గ్రీన్ చాక్ బోర్డుపై వివరించాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా, అంతర్జాలంలో అంతరాయం కలిగినప్పుడు వెంటనే బోర్డుపై పాఠాలు బోధించే అవకాశం ఉంటుంది. డిజిటల్ తెరకు రక్షణగా కూడా బోర్డులు ఉపయోగపడుతున్నాయి. బోర్డుకు తాళం కూడా



వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 36 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు మన ఊరు మన బడి కింద ఎంపికయ్యాయి. వీటిలో 33 పాఠశాలలకు డిజిటల్ తెరలు, గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు.

# అక్రమాల లెక్క తేల్చేదెన్నడు?

కరీంనగర్: రోగుల చికిత్సకు ఉపయోగపడాల్సిన నిధులవి.. ఆసుపత్రి అభివృద్ధికి వాడాల్సినవి.. వైద్యసేవల మెరుగుకు దోహదపడాల్సినవి.. వందలు, వేలు కాదు.. ఏకంగా లక్షలాది రూపాయల సొమ్ముకు రెక్కలొచ్చాయి. కాకి లెక్కల రూపంలో చేయని పనులకు ఇష్టానుసారంగా ఖర్చయ్యాయి. అడ్డూ అదుపు లేకుండా ఖజానా నుంచి మాయమయ్యాయి. కాపాలాగా ఉండాల్సిన వారే నొక్కేశారో.. లేదా ఖాళీగా ఖాతాల్లో ఉంచడం ఎందుకని జేబుల్లోకి తోసేశారో ఏదైతేనేం ప్రజాధనమిలా ఎప్పటికప్పుడు పక్కదారి పట్టింది. ఆడిట్ రూపంలో అసలు వ్యవహారం కొన్నాళ్ల కిందట బట్టబయలైంది. తప్పుల తడకల వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. చేతివాటాలు చూపిందెవరనేది ప్రాథమికంగా నిగ్గు తేలింది. విచారణలు మొదలయ్యాయి.. చర్యలు క్రమంగా కనిపించాయి. కాలం గడిచినా కొద్దీ.. అసలు లోగుట్టు తెలియడం లేదు. కాలం ముందుకు కదులుతున్నా.. ఈ తతంగం అక్కడే ఆగిపోయింది. ఇదంతా కరీంనగర్ జిల్లాసుపత్రిలోని నిధులు దుర్వినియోగం విషయంలో ఎదురవుతున్న లెక్కల చిక్కుల వ్యథ.!

ఏం జరిగిందంటే? గతేడాది నవంబరు 19న జిల్లాసుపత్రి అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అసలు ఆసుపత్రికి వస్తున్న నిధులెన్ని..? చేస్తున్న ఖర్చెంత..? అని మంత్రి గంగుల కమలాకర్ అధికారులను అడగ్గా వారంతా నీళ్లు నమిలారు. జాతీయ ఆరోగ్య మిషన్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులు, వివిధ పథకాలకు వచ్చినవి.. ఎంసీహెచ్‌లోని అద్దెగదుల ఆదాయం.. ఇలా అన్నీ కలిపి దాదాపు రూ.68 లక్షల విషయంలో లెక్కలైదగా బాధ్యులైన ఆసుపత్రి వర్గాలు ఏం చెప్పకుండా చేతులెత్తేశారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో రాష్ట్ర స్థాయి ఆడిట్ అధికారులు పరిశీలనలో ఇక్కడి డొల్లతనం బయటపడింది. వ్యయం విషయంలో అసలు ఏ పత్రాలు లేవని.. నిధులు ఎందుకోసం ఖర్చు చేశారనే వివరాలు లేవని తేల్చి చెప్పారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపించారు. నిర్లక్ష్యం వహించారనే సాకుతో ఓ జూనియర్ సహాయకుడిపై సస్పెన్షన్ వేటు వేశారు. మొత్తం ఆసుపత్రి పర్యవేక్షిస్తున్న ఓ అధికారిణి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఆమె ఆ కుర్చీలో ఉంటే అసలు లోగుట్టు పక్కాగా తెలియదని బాధ్యతల నుంచి తప్పించారు. సమగ్ర విచారణ జరపాల్సిందేనని రాష్ట్ర స్థాయి




అధికారులు నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ఈ నిధుల గుట్టు నిగ్గు తేలుస్తామని ప్రకటించి.. తరువాత నెలలు గడుస్తున్నా.. ఈ విషయాన్ని మరిచిపోయారు. గోల్‌మాల్ డబ్బుల స్వాధీనం వ్యవహారం అక్కడితోనే ఆగిపోయింది జరగాల్సిన విచారణ అటకెక్కింది.

ఒత్తిళ్లకు తలొగ్గారా?

కరీంనగర్ జిల్లాసుపత్రి వ్యవహారాలన్నీ ప్రత్యేకమే. ఇక్కడ ఏది జరిగినా తేలిగ్గా తీసుకుంటారనే ప్రచారముంది. దీన్ని నిజం చేసే విధంగా ఈ నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఇంకా కొనసాగాల్సిన విచారణ అర్ధాతరంగా ఆగిపోయింది. దీని వెనుక పెద్ద వ్యవహారమే నడిచిందనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్ల ప్రాధాన్యం అంతే బలంగా ప్రభావం చూపుతుందని కొందరు వారి వాదనలు వినిపిస్తుండగా.. చేసిన తప్పులను కప్పిపుచ్చేందుకు సొంత శాఖలోని కొందరు పెద్దోళ్లు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయి నుంచి ఆడిట్ సమయంలోనే కీలక ఆధారాలు లభించినట్లు తెలిసింది. వాటిపై సమగ్ర విచారణ జరిపితే బాధ్యులెవరనేది తేటతెల్లమయ్యేది. చాలా సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్ణీత మొత్తానికి మించి చెక్కుల రూపంలో నగదు ఉపసంహరించుకున్నారని తెలిసింది. ఇలా ఎవరెవరు చేశారు..? వాటిని దేనికి వినియోగించారనే విషయాలను విచారణలో గుర్తించాల్సి ఉంది. కానీ తరువాత విచారణ కొనసాగకపోవడంతో ఈ స్వాహాపర్వం అంతటితో ఆగిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరి 22న రాష్ట్రస్థాయి అధికారులు ఆడిట్ చేసి వెళ్లారు. అదే నెల 24న ఆసుపత్రి బ్యాంక్ ఖాతాలో దాదాపు 6 వేర్వేరు ఓచర్లతో రూ.3.82 లక్షలను ఉద్యోగి ఒకరు జమ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా పక్కదారి పట్టిన సొమ్ములో నుంచి వేర్వేరు రోజుల్లో మొత్తంగా రూ.8 లక్షల వరకు తిరిగి ఖజానాకు చేర్చారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా.. నిధుల దుర్వినియోగం విషయంలో విచారణ అంతం రాష్ట్రస్థాయి అధికారుల పర్యవేక్షణలో సాగుతుందని చెప్పారు. తాను ఛార్జ్ తీసుకున్నప్పటి నుంచి మాత్రం ఆసుపత్రి నిధుల విషయంలో అన్ని లెక్కలను నిబంధనల ప్రకారం ఉండేలా చూస్తున్నామని తెలిపారు.

# నిర్లక్ష్య ప్రాంగణాలు




కరీంనగర్: అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి, ఎల్లంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను చూసిన వారంతా విస్మయం చెందుతున్నారు. బ్రాహ్మణపల్లిలో పొలం వద్ద బోర్డు వేసి వదిలేశారు. ఆట పరికరాలను కూడా ఏర్పాటు చేయలేదు. ఎలంపల్లిలో ఆట పరికరాలు ఏర్పాటు చేసినా చుట్టూ పిచ్చిమొక్కలు, పక్కనే మురుగు ఉండటంతో దుర్గంధంతో క్రీడాకారులెవరూ రావడం లేదు. ప్రభుత్వం పల్లె ప్రాంగణాల నిర్మాణానికి రూ.లక్షలు వెచ్చిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల అసత్వంతో లక్ష్యం నెరవేరడం లేదు.

# ఇక.. ఉగ్గబట్టుకోనక్కర్లేదు..!

ఖమ్మం : గాంధీచౌక్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 1,050 మంది బాలికలు చదువుకుంటున్నారు. ఉన్నవి 8 మరుగుదొడ్లు. ప్రస్తుతం పనిచేస్తున్నవి నాలుగు. ఇవికాక విద్యార్థినుల సంఖ్యకు అదనంగా మరికొన్ని నిర్మించాల్సి ఉంది. ఒంటికి, రెంటికీ ఎంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్త మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించాలి.'

కళాశాల విద్యార్థిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 450 మంది బాల, బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. అవసరానికి తగినన్ని మరుగుదొడ్లు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. బాలురు దూరంగా నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోంది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో

స్వచ్ఛత, పరిశుభ్రత మెరుగు పరిచేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. పలు కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఫలితంగా బాల, బాలికలు ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసిందే. ఆయా కళాశాలల ప్రధానాచార్యులు సమస్యల్ని పలుమార్లు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఇంటర్మీడియట్ విద్యా




శాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పందించారు. బాల, బాలికలకు వేర్వేరుగా కావాల్సిన మరుగుదొడ్ల సముదాయాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తూ తాజాగా ఆదేశాలు జారీచేశారు. కళాశాలలకు నిర్వహణ ఖర్చులూ విడుదల చేశారు.

నిర్వహణకు వెసులుబాటుప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు ప్రారంభమయ్యాయి. అప్పట్నుంచి నిర్వహణకు చేతిలో నిధుల్లేక ప్రధానాచార్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.71 చొప్పున కళాశాలలకు ఇటీవల మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాకు రూ.3,38,599, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రూ.3,01,750 విడుదలయ్యాయి. ఈ నిధులలో స్టేషనరీ, చిన్నపాటి మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, వేడుకలు, సమావేశాల ఖర్చులు వెచ్చిస్తారు. దేనికెంత?విద్యార్థుల సంఖ్య ఆధారంగా కళాశాలల్లో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఒక సముదాయానికి రూ.4.60 లక్షలు, రెండింటికి రూ.9.20 లక్షలు, మూడింటికి 13.80 లక్షలు, నాలుగైతే 18.40 లక్షలతో నిర్మిస్తారు. ఒక సముదాయంలో నాలుగు దొడ్లు ఉంటాయి. వీటిని వేగంగా నిర్మించి నిర్వహణ చేపడితేనే బాధలు తప్పుతాయి.

# మున్నేరు.. ఆక్రమణల జోరు

ఖమ్మం : నది ఉప్పొంగి ప్రవహించినప్పుడు ఎక్కడి వరకు వరద నీరు వస్తుందో అధికారులు గుర్తించి ఆ ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా నిర్ణయిస్తారు. ఈ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. కానీ ఖమ్మం నగరం నడిబొడ్డున ఉన్న మున్నేరు ఉప నది బఫర్ జోన్‌లో ఏకంగా స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి. కొంతమంది అధికారులు మామూళ్ల మత్తులో నిర్మాణాలకు అనుమతులివ్వడం, రిజిస్ట్రేషన్లు కొనసాగడంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరికొంత మంది అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నిర్మాణాల అనంతరం రాజకీయ ఒత్తిళ్లతో నగరపాలక సంస్థ, పంచాయతీ అధికారులు వాటికి ఇళ్ల నెంబర్లు కేటాయించడం, ఆ తరువాత ఇతర వసతులు కల్పించడంతో ఆక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇటీవల మున్నేరుకు 30 అడుగుల వరద వచ్చిన నేపథ్యంలో ఎంత వరకు బఫర్ జోన్ అన్న విషయం చర్చకు రావడం విశేషం. 2008లో 25.60 అడుగులు వచ్చిన మున్నేరు వరద గత నెల 30.70 అడుగుల మేర ప్రవహించింది. ఈ ప్రవాహానికి ఖమ్మం నగరంలో 1,723, ఖమ్మం గ్రామీణ మండలంలో 502 ఇళ్లు నీట మునిగాయి.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

మున్నేరుకు ఒక వైపున ఖమ్మంనగరం, మరో వైపు ఖమ్మం గ్రామీణ మండలం ఉన్నాయి. రెండువైపులా మున్నేరు ఒడ్డున నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేసి తక్కువ ధరలకు స్థలాల అమ్మకం చేయడం, ఇళ్ల నిర్మాణం చేపట్టడం సర్వసాధారణంగా మారిపోయింది. బఫర్‌జోన్(నది పరిధిలోని ఒడ్డు)లో పట్టా భూమి ఉన్నా అందులో వ్యవసాయం చేసుకోవాలి తప్ప ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. కానీ పట్టా భూమితో పాటుగా ప్రభుత్వ భూములను ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ అక్రమ వెంచర్లలో గోడలు, తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. మున్నేరుకు ఇరువైపులా బఫర్ జోన్‌లోనే శ్మశాన వాటికల నిర్మాణాలు సైతం చేపట్టారు, వాటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసింది. గతంలో మున్నేరు ఆక్రమణ గురించి ఎంతోమంది ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం వచ్చిన వరదలతో అధికారులు హడావుడి చేస్తున్నారు. కానీ ఆక్రమణలు ఇకనైనా ఆగుతాయా, లేదంటే యథావిధిగా కొనసాగుతాయా చూడాలి.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తక్కువ ధరకు స్థలాలు వస్తున్నాయని కొంతమంది మధ్యతరగతి వారు ఇళ్లను కొనుగోలు చేసి నివాసాలు ఉంటున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు ఇళ్లన్నీ నీట మునిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కై అక్రమ వెంచర్లలో రహదారుల నిర్మాణం, విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇళ్లను కొనుగోలు చేశారు. వెంచర్ వేసిన వారు ప్లాట్లు విక్రయించి వాటిని సొమ్ము చేసుకొని వెళ్లిపోయారు. ప్రస్తుతం నివాసం ఉండే వారు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

నీట మునిగిన ప్రాంతాలు

ఖమ్మంనగరంలోని బొక్కలగడ్డ, మోతీనగర్, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, అగ్రహారం, రామన్నపేట, సమ్మక్క సారక్క ఆర్చీ, జూబ్లీక్లబ్ వెనుక ప్రాంతం... ఖమ్మం గ్రామీణ మండలం పెద్దతండా పంచాయతీలోని జలగంనగర్, కేబీఆర్‌నగర్‌కాలనీ, పోలేపల్లి పంచాయతీలోని దివ్యాంగుల కాలనీ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో మొత్తం 2,225 ఇళ్లు నీట మునిగాయి. 44 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, 928లో ఇంట్లో సామగ్రి కొట్టుకుపోయింది.

# సింగరేణిలో డంపర్ టైర్ల కొరత



మణుగూరు : సింగరేణిలో వంద టన్నుల సామర్థ్యం కలిగిన డంపర్ల టైర్ల కొరత ఏర్పడింది. దీంతో ఓపెన్ కాస్ట్‌ల్లో డంపర్లు నిలిచిపోతున్నాయి. ఓపెన్ కాస్ట్‌లో సింగరేణి సంస్థ ఓబీ, బొగ్గు రవాణాకు వంద టన్నుల సామర్థ్యం కలిగిన డంపర్లను వినియోగిస్తుంది. ఒక్కో డంపర్ 35 క్యూబిక్ మీటర్ల ఓబీని ఒక్కసారే వేరేచోటుకి రవాణా చేసి డంప్ చేయగలదు. అయితే గత రెణ్నెల్లుగా డంపర్లకు టైర్లు అందుబాటులో లేవు. ఆర్జీ ఓసీ- 3 గనిలో 13, మణుగూరు పీకే ఓసీ-2 గనిలో ఎనిమిది డంపర్లు టైర్లు లేక నిలిచిపోయాయి. డంపర్లు నిలిచిపోవటంతో ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది.

ఒక్కో టైరు ధర రూ.9 లక్షలు

వంద టన్నుల డంపర్ల టైర్లని మిచిలిమ్, జేకే టైర్, బ్రిడ్జి స్టోన్ కంపెనీలు తయారు చేస్తాయి. అయితే టైర్లలో రేడియల్, బయాస్ అనే రకాలు ఉంటాయి. బయాస్ రకంతో పోల్చితే రేడియల్ రకానివి నాణ్యంగా ఉంటాయి. ఈ రెండింటికి ధరల్లో వ్యత్యాసం కూడా ఉంది. రేడియల్ రకమైతే ఒక్కొక్కటి రూ.9 లక్షలు, బయాస్ రకమైతే రూ.4.50 లక్షల వరకు ఉంటాయి. పలు కంపెనీల టైర్లను సింగరేణి ప్రస్తుతం వినియోగిస్తోంది.

పలుమార్లు టెండర్ రీ ఫ్లోట్

వంద టన్నుల డంపర్లు అందించేందుకు సింగరేణి సంస్థ టెండర్ పిలిచింది. అయితే అదే టెండర్లను రీ ఫ్లోట్ చేసింది. దీంతో టైర్ల కొరత దేర్పడింది. ధరలు ఎక్కువగా ఉండటంతో తక్కువ కోట్ వచ్చేలా సింగరేణి ప్రయత్నించింది. కానీ ఆశించిన స్థాయిలో తక్కువ ధరకు టెండర్లు రాకపోవటంతో టెండర్లను రీ ఫ్లోట్ చేసి చేసింది. కోల్ ఇండియాలో డంపర్లకు ఏ టైర్లు వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకు ఓ కమిటీని కూడా వేసింది. ఆ కమిటీ కోల్‌కతలో అధ్యయనం చేసి నివేదికను అందజేసింది.

వంద టన్నుల డంపర్లే ఎందుకంటే?

సింగరేణిలో 11, 15 క్యూబిక్ మీటర్ల షావెల్స్‌తో ఓబీని, బొగ్గును వెలికి తీస్తారు. ఈ షావెల్స్‌కి సరిపడా బొగ్గు, మట్టిని రవాణా చేసే సామర్థ్యం వంద టన్నుల డంపర్లకు మాత్రమే ఉంది. తక్కువ సామర్థ్యం గల డంపర్లను వినియోగిస్తే సంస్థకు సమయం, ఖర్చు రెండూ వృథా అవుతాయి.మణుగూరు ఏరియాలో టైర్లు లేక డంపర్లు ఆగాయి. డంపర్లు అదనంగా ఉన్నందున వాటిని వినియోగిస్తున్నాం. బొగ్గు ఉత్పత్తికి ఏ ఇబ్బంది లేదు. టైర్లు ఆర్డర్ పెట్టాం. రావాల్సి ఉంది. దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు

# అభివృద్ధి పనులకు ప్రణాళిక




భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కసరత్తు సాగుతోంది. ఇప్పటికే ప్రగతిలో ఉన్నవాటిని ఉపయోగంలోకి తేవడంతో పాటు భవిష్యత్తు అవసరాలను గుర్తించి నూతన నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి రాగానే త్వరలో రూ.కోట్ల విలువైన పనులు ఆరంభించాలని నిర్ణయించారు. రూ.42 కోట్లతో పర్యాటక శాఖ చేపట్టిన ప్రణాళికలో కోవెల ప్రాంగణంలో ఫ్లోరింగ్‌తో పాటు షెడ్ల రూపురేఖల్లో మార్పు రానుంది. ఈ పనులపై ఈవో రమాదేవి దృష్టి సారించారు.

జీఎమ్మార్ (గ్రూప్) సహకారంతో..ఇటీవల జీఎమ్మార్ (గ్రూప్) ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు రామయ్యను దర్శించుకున్నారు. మాడ వీధుల మౌలిక సదుపాయాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. మాడవీధికి షెడ్లను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వర్షాకాలం, వేసవి కాలంలో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చని తెలిపారు. అందుకు ఆయన ఒప్పుకోవడంతో మ్యాప్‌ను సిద్ధం చేశారు. 16 అడుగుల ఎత్తులో మాడవీధి నుంచి నేరుగా అన్నదానం వరకు షెడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. భవిష్యత్తులో ఎలాంటి పనులు చేయాల్సి వచ్చినా ఈ నిర్మాణానికి ఇబ్బంది రాకుండా ప్రణాళిక రూపొందించారు.

భక్తులకు అదనపు సదుపాయాలు

ఆలయ కార్యాలయాన్ని తానీషా కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. దీనికి సమీపంలో రూ.3.60 కోట్ల దాతల నిధులతో జానకీ సత్రాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్ ప్లస్ 2 పద్ధతిలో 30 గదులు ఇందులో ఉన్నాయి. నిధులు మిగిలితే ఇంకొన్ని గదులు ఇక్కడ ఏర్పాటు చేస్తారు. జానకీ సత్రానికి ఆనుకుని సౌమిత్రి సదనం ఉండటంతో ఈ రెండింటిని కలిపేందుకు మధ్యలో లిఫ్టును ఏర్పాటు చేస్తున్నారు. వీటికి సమీపంలో తితిదే రూ.4.70 కోట్లతో నిర్మించిన కళ్యాణ మండపం ఉంది. ఇక్కడ రూ.20 లక్షలతో ఫర్నిచర్‌ను తితిదే సమకూర్చనుంది.రామాలయానికి 3 కి.మీ. దూరంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం(ఏపీ)లో రామాలయానికి భూములు ఉన్నాయి. ఇందులో 104 ఎకరాల్లో రెండు గోశాలలను నిర్మించారు. దీన్ని విస్తరించేందుకు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడున్న రెండు గోశాలలతో పాటు మరొకటి నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.60 లక్షలు అవసరం. దేవస్థానం నుంచి నిధులను ప్రతిపాదించినప్పటికీ దాతలను ఆహ్వానించనున్నారు.రంగనాయకుల గుట్టమీద ఉన్న అన్నవరం సత్రం, తితిదే సత్రాలు దెబ్బతినడంతో వీటిని పునరుద్ధరించాలని ప్రతిపాదించారు. ఆలయ వీఐపీ మార్గంలో పూర్తిస్థాయి పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. ప్రసాదాలు, నిత్యాన్నదానం నిమిత్తం వచ్చే సరకులను చిత్రకూట మండపంలోకి తీసుకెళ్లేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేస్తున్నారు.

# రామాలయంలో అభివృద్ధి పనులకు ప్రణాళిక

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కసరత్తు సాగుతోంది. ఇప్పటికే ప్రగతిలో ఉన్నవాటిని ఉపయోగంలోకి తేవడంతో పాటు భవిష్యత్తు అవసరాలను గుర్తించి నూతన నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి రాగానే త్వరలో రూ.కోట్ల విలువైన పనులు ఆరంభించాలని నిర్ణయించారు. రూ.42 కోట్లతో పర్యాటక శాఖ చేపట్టిన ప్రణాళికలో కోవెల ప్రాంగణంలో ఫ్లోరింగ్‌తో పాటు షెడ్ల రూపురేఖల్లో మార్పు రానుంది. ఈ పనులపై ఈవో రమాదేవి దృష్టి సారించారు.

జీఎమ్మార్ (గ్రూప్) సహకారంతో...ఇటీవల జీఎమ్మార్ (గ్రూప్) ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు రామయ్యను దర్శించుకున్నారు. మాడ వీధుల మౌలిక సదుపాయాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. మాడవీధికి షెడ్లను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వర్షాకాలం, వేసవి కాలంలో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చని తెలిపారు. అందుకు ఆయన ఒప్పుకోవడంతో మ్యాప్‌ను సిద్ధం చేశారు. 16 అడుగుల ఎత్తులో మాడవీధి నుంచి నేరుగా అన్నదానం వరకు షెడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. భవిష్యత్తులో ఎలాంటి పనులు చేయాల్సి వచ్చినా ఈ నిర్మాణానికి ఇబ్బంది రాకుండా ప్రణాళిక రూపొందించారు.అదనపు సదుపాయాలు..ఆలయ కార్యాలయాన్ని తానీషా కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. దీనికి సమీపంలో రూ.3.60 కోట్ల దాతల నిధులతో జానకీ సత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక్కడకు సమీపంలో తితిదే రూ.4.70 కోట్లతో నిర్మించిన కళ్యాణ మండపం




ఉందిగా.. ఆ సంస్థ మరో రూ.20 లక్షలతో ఫర్నిచర్‌ను సమకూర్చనుంది.రామాలయానికి 3 కి.మీ. దూరంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం(ఏపీ)లో రాములోరి భూములున్నాయి. అక్కడ రెండు గోశాలలున్నాయి. వీటికి తోడు మరొకటి నిర్మించనున్నారు. ఇందుక్కావాల్సిన రూ.60 లక్షలను దేవస్థానం నిధులతో పాటు దాతల విరాళాలుసేకరిస్తారు.

# ఇంటి నెంబర్లు సృష్టిస్తున్నారు..

జనగామ : ఆస్తి దక్కించుకోవడానికి చేయని ప్రయత్నం లేదు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని కొత్త దారులను అన్వేషిస్తున్నారు. ఖాళీ స్థలానికి, అనుమతి లేని, సరైన పత్రాలు లేని ఇళ్లకు అడ్డదారిలో ఇంటి నెంబర్లు సృష్టిస్తున్నారు. అలా ఇంటి నెంబర్ వస్తుందో లేదో వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇంటి నెంబర్లు కేటాయించే మున్సిపల్ సిబ్బందికి అదనపు ఆదాయం వస్తుండటంతో తూతూ మంత్రంగా ప్రక్రియను ముగించేస్తున్నారు. ఈ అక్రమ బాగోతంపై అందిస్తున్న ప్రత్యేక కథనం..

కబ్జాకు ఇదో మార్గం

ఇంటి నెంబర్ల కోసం ఎక్కువగా ఆరాటపడేది నోటరీ ధ్రువపత్రాలు కల్గిన వారే. నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్ కానందున.. ఇంటినెంబర్లు తీసుకుని ఆ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇదే అదనుగా దొంగ నోటరీ పత్రాలు పుట్టిస్తున్నారు. దీని ఆధారంగా ఇంటి నెంబర్ తీసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వేగంగా జరుగుతున్నాయి. ఆ వెంటనే ఆ స్థలాన్ని కబ్జా చేసేస్తున్నారు. అసలు యజమానికి తెర వెనక ఏం జరిగిందో తెలియకుండానే కబ్జాదారులు భూమిపై నిర్మాణాలు చేపడుతున్నారు. వివాదాస్పద భూమిగా మార్చి సెటిల్‌మెంట్ దందాకు దిగుతున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరగడంతో కాస్త పలుకుబడిని పెట్టుబడిగా పెట్టి ఈ దందా కానిచ్చేస్తున్నారు.



ఒక్కొక్కరి నుంచి వేల రూపాయలు..

జనగామ పురపాలిక పరిధిలో దళాద్రాల క్రితం స.నెం.53/1లో సుమారు 200 ఎకరాల్లో పెద్దఎత్తున బడుగు బలహీన వర్గాలకు, ఇందిరమ్మ కాలనీలో, 1957లో చేనేత కార్మికుల కోసం 18.33 ఎకరాల్లో లేఅవుట్ వేసి సొసైటీ ఆధ్వర్యంలో 100 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. 100 - 400 చ.గజాల స్థలాలు పొందారు. శక్తి మేరకు కొందరు ఇళ్లు కట్టుకున్నారు. ఇల్లు కట్టగా మిగిలిన స్థలాన్ని సొంత అవసరాలకు అట్టే పెట్టుకున్నారు. ఉన్న స్థలాన్ని వారసులకు పంపిణీ చేసి రిజిస్టర్ చేయలేకపోతున్నారు. నాయకులు, దళారులు రంగ ప్రవేశం చేసి ముందుగా ఇంటినెంబర్ల కేటాయింపు జరిగేలా చక్రం తిప్పుతున్నారు. ఇల్లు లేకపోయినా, ఉన్నట్లు ఇంటి నెంబర్ల కేటాయింపులు జరుపుతున్నారు. ఆ ఇంటి నెంబర్, పన్ను రశీదుతో రిజిస్ట్రేషన్లు చేసుకుని ఆస్తిమార్పిడి చేయించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో ఒక్కొక్కరి నుంచి రూ.5-10వేలు మున్సిపాలిటీ సిబ్బంది, రూ.25,000-40వేలు రిజిస్ట్రేషన్ ఉద్యోగులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖల ఉద్యోగులకు ఈ వ్యవహారం మంచి ఆదాయ వనరుగా మారింది. ఆయా కాలనీల్లో మిగులు స్థలాలను ఇంటి నెంబర్ల ఆధారంగా కబ్జా చేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి.

అక్రమాలకు తావు లేదు- రజిత, మున్సిపల్ కమిషనర్

సరైన పత్రాలు లేకుండా ఇంటి నెంబర్ల కేటాయింపు జరగడానికి ఆస్కారం లేదు. అసెస్‌మెంట్ల విషయంలో అక్రమాలకు తావు లేకుండా చూస్తాం. చట్టపరమైన ఆటంకాలు ఉన్నవాటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటాం.

# పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు

జనగామ : జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగు పెరుగుతోంది. ప్రధాన పంటలుగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న సాగవుతున్నాయి. వరి ప్రతి ఏటా రికార్డు స్థాయిలో సాగవుతోంది. అంతే స్థాయిలో ధాన్యం దిగుబడి పెరుగుతోంది. అన్నదాతల ఆదాయం పెంచాలని, దీర్ఘకాలం లాభాలు అందించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేసే దిశగా చర్యలు చేపట్టింది. రాయితీలు, మొక్కలు, డ్రిప్ పరికరాలు వంటి అందించి ప్రోత్సహిస్తోంది.

అనువైన నేలలు

జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి పంటలకు రైతులు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. వరి సాగు విస్తీర్ణం మరింతగా పెరగడం.. ధాన్యం కొనుగోళ్లలో ఏర్పడుతున్న ఆటుపోట్లతో గట్టెక్కేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనువైన నేలలు ఉన్నాయని మూడేళ్ల క్రితమే ప్రభుత్వ సర్వే బృందం పేర్కొంది. ఇందులో భాగంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో 426 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. 2022-23లో 3,210 ఎకరాలకు పైగా సాగు జరిగింది. ఈ సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు ఉద్యాన-పట్టు పరిశ్రమ, వ్యవసాయ శాఖల అధికారులు, ఉపాధి హామీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

సాగుకు రాయితీలు..ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ఒక్కో మొక్క ధర బహిరంగ మార్కెట్‌లో రూ.250 ఉండగా ప్రభుత్వం రూ.20కే అందిస్తోంది. రైతుకు ఒక్కో ఎకరాకు రూ.27,801 నాలుగు సంవత్సరాలలో అందించనుంది. ఇందులో ఎకరాలో మొక్కలు నాటినందుకు రూ.11,001, మొక్కలు నాటాక అంతర పంటలు, దున్నకాలు, ఎరువులకు ఒక్కో సంవత్సరం రూ.4,200 చొప్పున వరుసగా నాలుగేళ్ల పాటు రాయితీలను అందిస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు మొక్కలు నాటేందుకు గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులు ఉపాధి హామీ పథకం ద్వారా చేయిస్తారు. తోటల్లో అంతర పంటగా పత్తి, మిరప, పప్పు ధాన్యాల సాగు చేసుకోవచ్చు. ఈ విధంగా నాలుగేళ్ల పాటు సాగు చేసుకోవచ్చు. అనంతరం దిగుబడి ఆరంభమవుతుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి- కేతర్ లత, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి, జనగామఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాం. ఆసక్తి కల్గిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు, పాస్‌ఫొటోలతో ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి. రైతులకు ముందుగా 90శాతం ప్రభుత్వ రాయితీలతో కూడిన బిందు సేద్య పరికరాలను అందజేస్తున్నాం.

# అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

వేములవాడ : అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చాలా ఏళ్లగా మౌలిక సదుపాయాలు లేక అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి వాటిని గుర్తించిన ప్రభుత్వం దశల వారీగా వాటిలో మరుగుదొడ్డు, మూత్రశాలలు, నీటి వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే పనులు చేపడుతున్నారు.వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 225 కేంద్రాలున్నాయి. ఇందులో 123 కేంద్రాలకు సొంత భవనాలు, 51 కేంద్రాలకు అద్దెవి, మరో 51 కేంద్రాలను పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు చేపడుతున్నారు. గతంలో ఒక్కో మూత్రశాల, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు కేటాయించారు. ఆ నిధులు సరిపోకపోవడంతో ప్రస్తుతం రూ.36 వేలకు మళ్లీ అంచనాలు రూపొందించి పనులు చేపడుతున్నారు. వీటితో పాటు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైను ద్వారా నీటి సరఫరా చేసేందుకు సంపు, నీటి ట్యాంక్ ఏర్పాటుకు రూ.10 వేలను మంజూరు చేశారు. ఈ పనులన్నీ ప్రారంభించడంతో వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రెండు నెలల్లో వీటిని పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇవి పూర్తయితే అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు చాలా వరకు సమస్యలకు పరిష్కారం లభించనుంది.

ఒక్కో దానికి రూ. 2 లక్షలు...

వేములవాడ ప్రాజెక్టు పరిధిలో మరికొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో



అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఒక్కో దానికి రూ. 2 లక్షల ప్రత్యేక నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్, బోయినపల్లి-2, కోనరావుపేట-1, రుద్రంగి-2, వేములవాడ గ్రామీణ మండలంలోని ఎదురుగట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేశారు. ఆయా కేంద్రాల్లో ఆయా గ్రామ పంచాయతీల తీర్మానం మేరకు ఏయే పనులు చేపట్టాలనేది నిర్ణయించి పనులు చేపట్టనున్నారు.

అసంపూర్తి పనుల పూర్తికి ప్రతిపాదనలు

వేములవాడ ప్రాజెక్టు పరిధిలోని అసంపూర్తి భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. వేములవాడ మున్సిపల్‌లోని బాల్‌నగర్, శాత్రాజుపల్లి, వేములవాడ మండలంలోని చంద్రగిరి, చందుర్తి మండలంలోని జోగాపూర్, రుద్రంగి మండల కేంద్రం, వేములవాడ గ్రామీణ మండలం నూకలమర్రి తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. వీటి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

ఇబ్బందులు తొలగిపోతాయి- ఎల్లయ్య, సీడీపీవో, వేములవాడ

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం సొంత భవనాలున్న వాటిలో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పనులు పురోగతిలో ఉన్నాయి. ఇవి పూర్తయితే ఇబ్బందులు తొలగిపోతాయి. దశల వారికి అన్ని కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

# ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటయ్యేనా..?

గోదావరిఖని : ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలందించేందుకు ప్రభుత్వపరంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్థానికంగా నిర్వహణ గాడి తప్పడంతో గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రి నిర్వహణలో కీలకపాత్ర పోషించాల్సిన సూపరింటెండెంట్ సేవలు నామమాత్రమే కాగా వైద్య కళాశాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన ప్రిన్సిపల్ ఆసుపత్రి నిర్వహణను చూస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ మార్పులు కనిపించడం లేదు. నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటులో తీవ్ర జాప్యం నెలకొంటోంది. జిల్లా కలెక్టర్‌ను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తూ గతంలో ఉత్తర్వులు జారీచేసినా ఇంతవరకూ పూర్తిస్థాయి కమిటీ నియామకం జరగడం లేదు. ఈ కారణంగా ఆస్పత్రిలో పర్యవేక్షణ ఏకపక్షంగా సాగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఆసుపత్రి నిర్వహణ పర్యవేక్షణలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం. స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రికి సమర్థులను సూపరింటెండెంట్గా నియమించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని స్థానిక ఎమ్మెల్యే స్పష్టం చేసినప్పటికీ ఆశించిన పురోగతి లేదు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు కావాల్సిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో జిల్లా పరిషత్తు ఛైర్మన్, ఆసుపత్రి పరిధిలోకి వచ్చే ముగ్గురు ఎమ్మెల్యేలు, మేయర్, ఎంపీలతో పాటు వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద, సామాజిక సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. కమిటీ ఏర్పాటు జరిగితే సభ్యులుగా ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద, సామాజిక సంస్థల ప్రతినిధులు ఆసుపత్రి నిర్వహణపై దృష్టి సారించే అవకాశముంది. ప్రాంతీయ ఆసుపత్రిగా ఉన్నప్పుడు జిల్లా ఆసుపత్రుల నిర్వహణ పర్యవేక్షకులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు అప్పుడప్పుడూ సందర్శిస్తూ నిర్వహణపరమైన ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకున్నారు. కాగా సార్వజనిక ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులున్నా రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులే ప్రధాన దృష్టి సారించాల్సి ఉండడంతోనే ఆసుపత్రి నిర్వహణపై ఆశించిన పర్యవేక్షణ ఉండటం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొరవడిన సమన్వయం...

దవాఖానా నిర్వహణను పర్యవేక్షించాల్సిన రెసిడెంట్ మెడికల్ అధికారుల్లో ఒకరిద్దరు పెద్దగా పట్టించుకోకపోగా ఒకరిద్దరు అత్యుత్సాహంతో కింది స్థాయి సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా వైద్య విధాన పరిషత్తునకు చెందిన సిబ్బందిపై వివక్షతోనే ఇలా వ్యవహరిస్తున్నారని ఆయా వర్గాల నుంచి ఆవేదనలు వినిపిస్తున్నాయి. తమను వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రులకు బదిలీ చేయాలంటూ ఇటీవల కొందరు ఉద్యోగులు జిల్లా స్థాయి అధికారులను వేడుకోవడం గమనార్హం. ఆసుపత్రి నిర్వహణతో ఏమాత్రం సంబంధం లేని ఓ ఒప్పంద కార్మికుడు నిర్వహణపై పెత్తనం చేస్తుండడం వారిని మరింత వేదనకు గురి చేస్తుంది. ఒప్పంద కార్మికుల నియామకంలో వసూళ్లపర్వం తెరపైకి రాగా విషయం పోలీసు స్టేషన్ వరకూ వెళ్లింది. కొన్ని విభాగాల్లో మందులతో పాటు ప్రయోగశాలల్లో అవసరమైన సామగ్రి, రసాయనాలు లేకపోవడంతో అత్యవసరమైతే తప్ప ఆయా పరీక్షలు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఒప్పంద విధానంలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు సైతం ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులతో దురుసుగా వ్యవహరిస్తున్న సంఘటనలున్నాయి.

# అన్నదాతకు కొరవడిన ఆర్థిక ఆసరా



జగిత్యాల : వానాకాలం-2020లో అధిక వర్షాలతో పంటలను కోల్పోయిన కర్షకులకు 3 మాసాల్లోపు పెట్టుబడి రాయితీని, 4 మాసాల్లోపు పంటలబీమా పరిహారాన్ని ఇవ్వాలని హైకోర్టు 2021 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ ఆసీజన్‌తో పాటుగా తదుపరి సీజన్లలోనూ రైతులకు వాటిల్లిన నష్టానికి పరిహారాన్ని ఇవ్వకపోవటం రైతులకు ఆర్థిక నష్టాన్నే మిగిల్చింది.

భారీగానే పంటనష్టం

2020 వానాకాలంలో కేవలం జగిత్యాల జిల్లాలోనే అధిక వర్షాలతో 6,525 మంది రైతులకు చెందిన 9,417 ఎకరాల్లో వరి, మక్క, పసుపు, కంది, పత్తి, సోయా తదితర పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. తదుపరి 2020-21 యాసంగి, 2021 వానాకాలంలోనూ అకాల వర్షాలు, వరదలు, గాలివానలతో 26,900 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. గడిచిన వానాకాలంలోనూ 22,993 ఎకరాల్లో ఆరుతడి పంటలు, 4,130 ఎకరాల్లో వరిపైరు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. 2000 నుంచి గత సీజన్‌వరకు జిల్లా రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.190 కోట్లవరకు నష్టంవాటిల్లినా కోర్టు తీర్పు ప్రకారం పెట్టుబడి రాయితీ ఇవ్వలేదు. మరోవైపు గడిచిన 5 సీజన్లుగా పంటలబీమా అమలుకు నోటిఫికేషన్‌ను వెలువరించనందున బీమా అమలు దాదాపుగా నిలిచిపోయి రైతులకు పంటలబీమా పరిహారం కూడా అందే అవకాశం లేకుండాపోయింది.

పరిహారం అనుమానమే

ప్రకృతి విపత్తులతో పంటలకు నష్టం వాటిల్లితే వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు అదేరోజు పరిశీలించి ప్రాథమికంగా ఎన్ని ఎకరాల్లో నష్టం జరిగిందని అంచనా వేసి ప్రభుత్వానికి తెలుపుతారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాలు వెలువరిస్తే రెవెన్యూ అధికారులతో కలిసి రైతువారీగా సర్వేజరిపి నష్టం, రైతుల వివరాలతో సహా నివేదికను ప్రభుత్వానికి పంపిస్తారు. ఈ నివేదిక ప్రకారం 33 శాతం దాటిన నష్టానికి ఉద్యాన పంటలు, హెక్టారు వరికి 13,500, మక్కకు, 8,333 పరిహారాన్ని రాష్ట్రప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయాలి. కానీ నష్టాన్ని ప్రాథమిక అంచనాతో అధికారులు పంపిస్తున్నా మూడేళ్లుగా తుది సర్వే జరపాలని ప్రభుత్వం ఆదేశించనందున అధికారులు క్షేత్ర సర్వే జరపలేదు, పరిహారం విడుదల చేయలేదు. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా 8 పంటలకు బీమా ఉండేది. కాగా గత ఐదు సీజన్లుగా ప్రభుత్వం బీమా నోటిఫికేషన్ విడుదల చేయనందున పంటలబీమా అమలు దాదాపుగా నిలిచిపోయింది. ఆసక్తిగల రైతులు అతితక్కువగా ప్రైవేటు కంపెనీలకు కిస్తీ చెల్లించినా పరిహారం అందటం గగనంగా మారుతోంది. మరోవైపు తాము చెల్లించాల్సిన 50 శాతం కిస్తీని కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీమా కంపెనీలకు సకాలంలో ఇవ్వక బీమా అమలులేక పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం రావటంలేదు. ఈ నేపథ్యంలో బీమా పరిహారం అందే అవకాశం లేనందున రాష్ట్రప్రభుత్వం పెట్టుబడి రాయితీని విడుదల చేయాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

# అధ్యాపకుల హాజరు నమోదులో అక్రమాలకు చెల్లు



కరీంనగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు నమోదు కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వాటి పరికరాలు కళాశాలలకు చేరుతున్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 80 శాతం కళాశాలలకు అందజేశారు. వివరాల నమోదు పూర్తవగానే అమలు చేయాలని ఇంటర్ విద్యాశాఖ భావిస్తోంది. సమయ పాలనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తున్నారు.

వచ్చే నెల 1 నుంచి అమలుకు సన్నాహాలు మొదట ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. తర్వాత డీఐఈవో (జిల్లా ఇంటర్ విద్యాధికారి), నోడల్ ఆఫీసర్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. ఇప్పుడు కళాశాలల్లో అమలు కానుంది. జనవరి 1 నుంచి బయోమెట్రిక్ హాజరు వేయాలని ముందుగా భావించారు. అయితే డివైస్‌ల పంపిణీ, ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ ఆలస్యమైంది. వీలైనంత త్వరగా అధ్యాపకులు వేలుముద్రతో హాజరు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

గతంలోనూ బోధన, బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థులకు ఈ విధానాన్ని అమలు చేశారు. కొవిడ్-19 నేపథ్యంలో వాటిని పక్కన పెట్టారు. అవి తిరిగి వాడుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో కొత్త యంత్రాలను కళాశాలలకు అందజేస్తున్నారు.


గత పాఠాలు నేర్చుకొని...గతంలో సిబ్బంది హాజరు నమోదు చేయడంలో సమస్యలతోపాటు అక్రమాలు జరిగినట్లు ఇంటర్ బోర్డు గుర్తించింది. డివైస్ చిన్నగా ఉండటంతో వాటిని తాము ఉన్న చోటుకు తీసుకెళ్లి వేలి ముద్ర వేసిన సంఘటనలు ఉన్నాయి. అంతే కాకుండా వివరాలు నమోదు చేసే క్రమంలో ఒకరివి రెండు బొటన వేళ్లను స్కాన్ చేయాలి. ఇక్కడ ఒకరి వివరాల నమోదులో ఇద్దరు ఒకరిది ఎడమ, మరొకరిది కుడి వేలును స్కాన్ చేసి ఉంచారు. దీంతో ఒక్కరు వెళ్లినా ఇద్దరి హాజరు వేసే అవకాశం ఉండేది. ఇకపై అలాంటి అవకాశం లేకుండా చేశారు. అక్రమాలకు చోటు లేకుండా సాంకేతిక సహాయం తీసుకున్నారు. పకడ్బందీ విధానంతో నూతన పద్ధతి అమలు చేయనున్నారు. అబాస్ (ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్) అమలు చేస్తున్నారు.

విధివిధానాల ఖరారుకు కసరత్తు..

జిల్లాకు నాలుగైదు మినహా మిగిలిన కళాశాలకు బయోమెట్రిక్ యంత్రాలను అందజేశారు. ఇంటర్ బోర్డు నుంచి కళాశాల ప్రధానాచార్యుల వివరాలను నమోదు చేసి పంపిణీ చేశారు. ఇతర సిబ్బందికి ఐడీని డీఐఈవో, నోడల్ అధికారులు కేటాయించే పనిలో ఉన్నారు. స్థానిక టెక్నికల్ ఇంజినీర్లు వాటిని ఇన్‌స్టాలేషన్ చేస్తున్నారు. అంతేకాకుండా విధి విధానాలను ఖరారు చేయనున్నారు. ఆలస్యంగా వస్తే సీఎల్‌లో కోత విధించే అవకాశముంది. ఇదంతా ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని చూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి తీసుకురావాలనే ప్రయత్నం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు మరొక తేదీని ప్రకటించే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. అతి త్వరలోనే కళాశాలల్లో పని చేసే ప్రధానాచార్యులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సమయ పాలన పాటించే సమయం ఆసన్నమైంది. ఆ తర్వాత విద్యార్థులకు అమలు చేస్తారు. ఆధార్‌తో అనుసంధానం..అధ్యాపకులు, సిబ్బంది ఆధార్ కార్డు నెంబరుతోపాటు ఐడీతో అనుసంధానం చేస్తారు. ఇక ఆధార్ అనుసంధానం చేయడంతో బొటన వేళ్లను కొత్తగా స్కాన్ చేయాల్సిన పని లేదు. మరొకరిది వేసినా అది తీసుకోదు. అంతే కాకుండా డివైస్‌లో సిమ్ కార్డు ఉంటుంది. ప్రతి కళాశాలను గతంలోనే జియో ట్యాగింగ్ చేశారు. దీంతో కళాశాలల్లోనే హాజరు నమోదు జరగాలి. మరొక చోటుకు డివైస్ తీసుకెళ్లి వేస్తే ఇట్టే దొరికిపోతారు. జీపీఎస్‌తో కళాశాల పరిసరాల్లో ఏ సమయానికి హాజరు వేశారో జిల్లా అధికారులతోపాటు ఇంటర్ విద్యా కమిషనర్ కార్యాలయంలో పర్యవేక్షించే అవకాశముంది. ఇది ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోంది.

# గండి పూడ్చివేతకు చర్యలు

వరంగల్ : ఎస్సారెస్పీ ఉపకాలువకు పడిన గండిని పూడ్చి వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సారెస్పీ ఈఈ జి.సమ్మిరెడ్డి చెప్పారు. దంతాలపల్లి శివారులోని ఎస్సారెస్పీ 9ఎల్ ఉపకాలువకు గండిపడి వృథాగా పోతున్న సాగునీటి తీరుపై 'గండి పడినా పట్టించుకోరా..' కథనానికి ఆయన స్పందించారు. డీఈ వినయ్, ఏఈ మౌనికతో కలిసి ఆయన గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయకట్టు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పనులకు సంబంధించిన అగ్రిమెంటు ఇంకా పూర్తి కాలేదన్నారు. గండిని పూడ్చివేసే పనులను గుత్తేదారు చేపట్టాల్సి ఉందన్నారు. పలుమార్లు గుత్తేదారును మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించినప్పటికీ స్పందన రావడం లేదన్నారు. గండి పడటంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. గండి పూడ్చివేత, సాగునీటి సరఫరా సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



కాలువకు ఎగువన ఉన్న బండరాళ్లను తొలగిస్తే సాగునీరు వెళ్లే అవకాశం ఉందన్నారు. గండి పడి పక్షం రోజులు గడుస్తోన్నా నేటికీ మరమ్మతు పనులు ఎందుకు చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు, భాజపా నాయకులు అధికారులను ప్రశ్నించారు. వర్క్ఇన్‌స్పెక్టర్ దేవేందర్, నాయకులు మహేష్‌గౌడ్, పూర్ణచందర్, శ్రీను, రైతులు శ్రీనివాస్‌రెడ్డితో పాటు తదితరులున్నారు.

# లక్ష్యం వైపే.. ఏడడుగులు

వరంగల్ : బాల్య వివాహమంటే చిన్నతనంలోనే చిట్టి తల్లుల ఆశలను చిదిమేసినట్లే. ఆడపిల్ల అంటే గుండె మీద కుంపటన్నట్లు కొందరు బాల్యంలోనే పెళ్లి చేసి భారం దించుకోవాలని ప్రయత్నిస్తున్న తల్లిదండ్రులను ఎదిరించారు. 1098 నంబరుకు ఫోన్ చేసి ఆపద నుంచి గట్టెక్కారు. అలా ధైర్యంతో పెళ్లి కాకుండా లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత విద్య చదువుతూ, ఉద్యోగంలో రాణిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నేడు జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని అందిస్తున్న స్ఫూర్తిదాయక కథనం.

'చైతన్యా'నికి ప్రేరణ

మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలంలోని ఒక గ్రామంలో మరో 24 గంటల్లో పెళ్లి పీటలు ఎక్కబోతున్న చైతన్య అనే బాలిక స్వయంగా టోల్‌ఫ్రీ నెంబర్ 1098కు కాల్ చేసింది. పెద్దలు తనకు బాల్య వివాహం జరిపిస్తున్నారని, పెళ్లిని ఆపాలని, చదువుకోవాలని వేడుకుంది. ఛైల్డ్‌లైన్, బాలల సంరక్షణ అధికారులు రంగంలోకి దిగి ఆ బాల్య వివాహానికి అడ్డుకట్ట వేశారు. రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న ఈ పరిణామం బాలిక ధైర్యానికి నిదర్శనంగా నిలిచింది. ఇప్పుడా ఆ బాలిక మహబూబాబాద్‌లో ఉన్నత చదువులు చదువుకుంటోంది. బాలిక ధైర్యాన్ని మెచ్చి రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ



మంత్రి సత్యవతి రాథోడ్, చైతన్యను కలెక్టరేట్‌కు పిలిపించి అభినందించారు. అప్పట్లో ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడిగా ఉన్న డా.పరికిపండ్ల అశోక్ బాలిక ఆకాంక్షను వెన్నుతట్టి ప్రోత్సహించారు.

పాఠశాలలో 1098 నంబరు చూసి ..

వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి చెందిన స్ఫూర్తి అనే బాలిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న క్రమంలో తల్లిదండ్రులు ఆమెకు వివాహం నిశ్చయించారు. అదే సమయంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో 'బాల్యానికి భరోసా' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. బాల్య వివాహాల వివరాలు తెలిస్తే.. 1098 ఛైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. పాఠశాలలో అవగాహన గోడపత్రికలను అతికించారు. అందులోని నంబరును నోట్‌చేసుకుని తనకు తల్లిదండ్రులు బాల్యవివాహానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ బాలిక అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. తక్షణమే స్పందించిన అధికారులు గ్రామానికి చేరుకుని తల్లిదండ్రులకు, బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ బాలిక డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది.

రెండక్షరాలే చెప్పి..

వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన సమతకు చిన్ననాటి నుంచే చదువుపై అమితాసక్తి. ఇంటర్మీడియట్ చదివే సమయంలో తల్లిదండ్రుల ఆర్థిక సమస్యల కారణంగా పెళ్లి నిశ్చయించారు. సమతకు విషయం తెలియడంతో.. నర్సంపేట స్నేహితురాలి ఇంటికి పారిపోయింది. అక్కడి నుంచి జిల్లా బాలల సంరక్షణాధికారికి 'సేవ్ మీ' అని లేఖ రాసింది. స్పందించిన అధికారులు అప్పటి జిల్లా కలెక్టర్ హరిత ఆదేశాలతో వివాహాన్ని అడ్డుకుని హనుమకొండలోని బాల సదనంలో ఆశ్రయం కల్పించి చదివించారు. ప్రస్తుతం సమత హైదరాబాద్‌లోని గాంధీ వైద్యకళాశాలలో విద్యనభ్యసిస్తోంది.

భళారే అన్నారు..

భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండల పరిషత్తు కార్యాలయంలో గతేడాది ఒక సదస్సు ఏర్పాటైంది. సదస్సుకు చాలా మంది బాలబాలికలు కూడా వచ్చారు. పెద్దలందరి ఉపన్యాసాలు విన్నాక గాయత్రి అనే బాలిక.. వేదికపైకి వచ్చి మైకు అందుకుంది. బాలికల హక్కుల పరిరక్షణ అజెండాతో నిర్వహించే కార్యక్రమాలలో వక్తలు విలువైన అంశాలు చెప్పారని, ఇలాంటి సదస్సు నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల మధ్య నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. అప్పుడే ఆశించిన ఫలితం మెరుగ్గా ఉంటుందని చెప్పుకొచ్చింది. ఈ చిన్నారి వాదనతో ఆ రోజు వేదిక మీదున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వై.బృందాదర్‌రావు, ఇతర ఉన్నతాధికా రులు, ప్రజాప్రతినిధులు ఏకీభవించారు. బాలికా...భళారే అంటూ కొనియాడారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా దోర్నకల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

# ఒక్కో అడుగేస్తూ.. కాజేస్తూ..!

ఆలేరు : ఆలేరు రెవెన్యూ పరిధిలోని సోమరాజుబావి సమీపంలో ఎర్రకుంట ఉంది. 798 సర్వే నంబరులో విస్తరించి ఉన్న కుంటశిఖం సుమారు 7 ఎకరాల 34 గుంటలుగా రికార్డుల్లో నమోదైంది. దీనికి ఆనుకొని 799 సర్వే నంబరులో పట్టా భూములు ఉన్నాయి. కుంట నిండితే పరిసర ప్రాంతంలో భూగర్భ జలమట్టం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది. గతంలో కుంటలోని మట్టిని అనుమతుల్లేకుండా తవ్వుకు పోవడంతో లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నీటి పారుదల, రెవెన్యూశాఖ అధికారులు మట్టిని తవ్వరాదని హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది.

జాతీయ రహదారికి సమీపంలో..

ఆలేరు రెవెన్యూ పరిధిలోని 798, 799 సర్వే నంబర్లలోని భూములు హైదరాబాదు- భూపాలపట్నం జాతీయ రహదారికి అతి సమీపంలో ఉండటంతో ఎకరం ధర రూ.కోట్లలో ఉంది. ఈ క్రమంలో కొందరు కుంట ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇప్పటికే కొంత భూమి ఆక్రమణకు గురికాగా.. ఇటీవల ఒక పట్టాదారు కుంటలో కొంత భాగాన్ని పూడ్చుతూ మట్టిని నింపారు. కుంట ఉనికికే ప్రమాదం ఏర్పడింది. కుంటను పూడ్చిన స్థలంలో యథేచ్ఛగా నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణానికి పురపాలిక నుంచి ఎలాంటి అనుమతుల మంజూరు లేదు. భూ ఆక్రమణ, అక్రమ నిర్మాణం విషయమై స్థానికులు కొందరు రెవెన్యూ, పురపాలిక అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం- ఎ.విజయ్‌కుమార్, ఏఈ, నీటి పారుదలశాఖ

ఎర్రకుంట శిఖం భూముల ఆక్రమణ విషయమై విచారణ చేస్తున్నాం. ఈ క్రమంలో ఆలేరు రెవెన్యూశాఖ అధికారులతో సర్వే చేయిస్తున్నాం. ముందుగా కుంట శిఖం హద్దులు గుర్తించాల్సి ఉంది. ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# మంత్రులైనా ఎంతటి వారైనా...జగన్ లెక్క పక్కాగా అదేనట...?



అమరావతి : వైసీపీలో ఎవరికి టికెట్లు ఇవ్వాలి. ఎవరిని పక్కన పెట్టాలి ఇదే జగన్ ఆలోచనగా సాగుతోంది. ఎవరినీ వదులుకోను, నాతో పాటుగా మీరంతా వచ్చే అసెంబ్లీలో సైతం కనిపించాలి అని జగన్ ఆ మధ్య వర్క్ షాప్ సందర్భంగా పార్టీ వారికి చెప్పారు. అయితే పనితీరు బాలేకపోతే తానేమీ చేయలేనని కూడా చెప్పారు. కావాల్సినంత టైం ఇచ్చినా పార్టీ పరంగా గ్రాఫ్ పెంచుకోని వారు ఉంటే కనుక టికెట్ కి టిక్కు పెట్టడం ఖాయమని తాడేపల్లి వైపుగా ప్రచారం అయితే జోరుగా సాగుతోంది. ఈ లిస్ట్ లో ఎవరైనా ఉండవచ్చు అని అంటున్నారు. వారు మంత్రులు అయినా జగన్ కి బాగా క్లోజ్ అయినా సరే ఎంతటి పెద్ద వారు అయినా సరే గ్రాఫ్ రివర్స్ కొడితే టికెట్ బోల్తా కొడుతుందని అంటున్నారు. ఇది నిజంగా ప్రచరామా జగన్ అలా చాలా మంది పెద్దలకే టికెట్లు లేకుండా చేస్తారా ఆంటే అవుని అదే నిజం అని అంటున్నారు. మరి ఇంతకీ జగన్ దగ్గర ఉన్న సర్వేలు ఏమి చెబుతున్నాయి ఎవరెవరికి టికెట్లు దక్కకుండా పోతాయన్నది కనుక చూసుకుంటే చాలా పెద్ద లిస్టే అని అంటున్నారు. ఇక వైసీపీ అధినాయకత్వం ఆ పార్టీ స్లోగన్ అయిన వై నాట్ 175 కి తగినట్లుగానే అభ్యర్ధుల సెలక్షన్ చేస్తోంది అని అంటున్నారు. కీలకమైన నియోజకవర్గాలలో వైసీపీ అభ్యర్ధుల ఎంపిక అన్న అతి పెద్ద కసరత్తు ముమ్మరంగా సాగుతోందని జోరుగా ప్రచారం అయితే ఉంది.ఏ అభ్యర్ధి అయితే సునాయాసంగా గెలుస్తారు అన్నది వడపోత పట్టే కార్యక్రమం సాగుతోంది అని అంటున్నారు. అలాగే ఏ నియోజకవర్గంలో ఎవరి గెలుపు కష్టంగా ఉంది. అలాగే ఏ అభ్యర్ధి కొంచెం కష్టపడితే గెలవగలరు అన్న డేటా కూడా పార్టీ వద్ద ఉందని అంటున్నారు. ఇలా కనుక చూస్తే టోటల్ గా 175 నియోజకవర్గాలలోని డేటా అంతా పాటీ వద్ద ఉందని, దీని మీద పూర్తి స్థాయి కసరత్తు కూడా పూర్తి అయింది అని అంటున్నారు. ఈ డేటా నుంచే తుది జాబితాను తయారు చేస్తే మాత్రం ఎమ్మెల్యేలలో చాలా మందికి అలాగే మంత్రులలో కూడా కొందరికి టికెట్ దక్కని పరిస్థితి ఉంటుందని అంటున్నారు. ఇక ఎన్నికలు చూస్తే కొద్ది నెలలు మాత్రమే సమయం ఉంది కాబట్టి అప్పటిలోగా గ్రాఫ్ కొత్తగా పెరిగేది కూడా లేదని అంటున్నారు. గత ఏడాది కాలంగా జగన్ చెప్పినట్లుగా కనుక నాయకులు జనంలోకి వెళ్ళి ఉంటే వారి గ్రాఫ్ పెరిగేది అని అంటున్నారు. అలా వెళ్ళిన వారిలో గతంలో డేంజర్ జోన్ లో ఉన్న వారు సేఫ్ జోన్ లోకి వచ్చిన ఉదంతాలు కూడా ఉన్నాయట. ఇక టికెట్ దక్కని వారి జాబితాలో ఉత్తరాంధ్రాకు చెందిన ఒక యువ మంత్రితో పాటు కోస్తా జిల్లాలకు చెందిన ఇద్దరు మంత్రులు ఉన్నట్లుగా ప్రచారం అయితే గట్టిగా సాగుతోంది. అలాగే రాయలసీమకు చెందిన ఒక మహిళా మంత్రికి టికెట్ కష్టమని ప్రచారం గట్టిగా వినిపిస్తోంది. ఇక పవన్ కళ్యాణ్ మీద తెల్లారితే గట్టిగా విమర్శలు చేసే ఆయన సామాజిక వర్గానికి చెందిన మంత్రికి కూడా టికెట్ కట్ అని అంటున్నారు. ఇక్కడ గెలుపు ఒక్కటే ప్రమాణంగా తీసుకుంటున్నారని అంటున్నారు. జగన్ కి ఎంత సన్నిహితులు అయినా జనంలో వారు లేకపోయినా గెలుపు గుర్రాలు కాకపోయినా టికెట్ నో చెప్పేస్తారు అని అంటున్నారు. మరి చాలా పకడ్బంధీగా రూపొందిస్తున్న ఈ జాబితా కనుక అనుకున్నట్లుగా ప్రచారంలో జరిగినట్లుగా కనుక వస్తే మాత్రం చాలా మందికి షాకుల మీద షాకులు తప్పవని అంటున్నారు. మరి టికెట్ కోసం ఎవరెంతగా తాడేపల్లికి తిరిగినా జగన్ని ప్రసన్నం చేసుకోవాలని చూసినా కూడా వై నాట్ 175 స్లోగన్ ముందు అవేమీ నిలబడవని అంటున్నారు. సో అదన్న మాట మ్యాటర్.





# బంగారం, వెండి ధరలు నేడు ఎలా ఉన్నాయంటే..

బంగారం, వెండి ధరలు నేడు కాస్త గుడ్ న్యూస్ అందించాయి. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల్లో మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. ఈ మధ్య కాలంలో బంగారం, వెండి ధరలు స్టైల్ మార్చాయి. గతంలో రోజువారీ మార్పులకు గురవుతూ ఉండేవి. కానీ ఇప్పుడు డైలీ స్థిరంగా ఉంటూ ఏదో ఒకరోజు మాత్రం మార్పునకు గురవుతోంది. నేడు బంగారం ధర తగ్గింది అనుకోవడానికి లేకుండా అత్యంత స్వల్పంగా తగ్గింది. పెరగలేదు కాబట్టి కొనుగోలుదారులకు ఇది శుభవార్తే. ఇక నేడు 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280కి చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ.77,000కి చేరుకుంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

**బంగారం ధరలు..** హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280. విశాఖపట్టణంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,500.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,650. కేరళలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280. బెంగుళూరులో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280. కోల్‌కతాలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280. ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,280. ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,400.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,430

**వెండి ధరలు..** హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.80,000. విజయవాడలో కిలో వెండి ధర రూ.80,000. విశాఖపట్టణంలో కిలో వెండి ధర రూ.80,000. చెన్నైలో కిలో వెండి ధర రూ.80,000. కేరళలో కిలో వెండి ధర రూ.80,000. బెంగుళూరులో కిలో వెండి ధర రూ.75,500. కోల్‌కతాలో కిలో వెండి ధర రూ.77,000. ముంబైలో కిలో వెండి ధర రూ.77,000. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.77,000.

# చిరుత దాడిలో పాప మృతి అత్యంత విషాదకరం



అమరావతి: తిరుమలలో చిరుత దాడిలో చిన్నారి మృతి చెందిన ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ..."కుటుంబసభ్యులతో కలిసి అలిపిరి మార్గంలో తిరుమల కొండకు కాలినడకన వెళ్తున్న ఆరేళ్ళ చిన్నారి లక్షిత చిరుత దాడిలో మృతి చెందడం అత్యంత విషాదకరం. కళ్ళముందే క్రూర జంతువు కూతురిని లాక్కెళ్లిపోతే ఆ బాధ వర్ణనాతీతం. పాప తల్లిదండ్రులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. కొద్దిరోజుల క్రితం చిరుత దాడిలో బాలుడు గాయపడ్డ ఘటన జరిగింది. ఈ కారణంగా అయినా టీటీడీ మరిన్ని రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఈ ఘోరం తప్పేది. అధికారులు సమర్ధవంతమైన ప్రణాళికతో వ్యవహరించి, తగు రక్షణతో భక్తుల భయాన్ని తొలగించాలి" అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

# పాతపట్నం టీడీపీలో కొత్త పోరు...బాబు ఫినిషింగ్ టచ్ ?



శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం సీటు ఈసారి వైసీపీ నుంచి టీడీపీకి వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. నిజానికి ఈ సీటు చాలా కాలం పాటు టీడీపీకి కంచుకోటలా ఉండేది. 2014లో ఫస్ట్ టైం వైసీపీ గెలిచింది. టీడీపీలో ఎమ్మెల్యేగా పనిచేసిన కలమట మోహనరావు కుమారుడు వెంకటరమణ వైసీపీలోకి జంప్ చేసి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తరువాత ఆయన టీడీపీలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి కలమట పోటీ చేస్తే వైసీపీ నుంచి రెడ్డి శాంతి ఆయన్ని ఓడించారు. మంచి మెజారిటీతో వైసీపీని గెలిపించినా రెడ్డి శాంతి తనదైన పనితీరుతో తక్కువ వ్యవధిలఒనే వ్యతిరేకత నిండా తెచ్చుకున్నారని అంటున్నారు. దాంతో ఇక్కడ వైసీపీ గ్రాఫ్ బాగా తగ్గుతోంది అని అంటున్నారు. ఇక వైసీపీలో వర్గ పోరు, ఎమ్మెల్యే స్థాయి అభ్యర్ధులు లేని లోటు తో పాతపట్నం పరిస్థితి అధికార పార్టీలో అయోమయంగా ఉంటే టీడీపీ మాత్రం బాగా పుంజుకుంది. అయితే ఈ సీటు కోసం టీడీపీలో వర్గ పోరు సాగుతుంది. మామిడి గోవిందరావు అనే నేత ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు గట్టిగా చేస్తున్నారు. ఆయనకు టీడీపీలో బలమైన నేత ఆశీస్సులు కూడా ఉన్నాయని అంటున్నారు. అయితే పాతపట్నం ఇంచార్జిగా మాజీ ఎమ్మెల్యే కలమట ఉన్నారు. తాజాగా చంద్రబాబు పాతపట్నం టూర్ చేసినపుడు ఆయన వెంట కలమట ఉన్నారు. బాబు సైతం ఆయన్ని తన పక్కన కూర్చోబెట్టుకుని పార్టీ జనాలకి ఒక కీలక సందేశమే ఇచ్చారని అంటున్నారు. పాతపట్నంలో వర్గ పోరు ఎలా ఉన్నా మళ్ళీ కలమటకే టికెట్ ఇవ్వడానికి బాబు డిసైడ్ అయినట్లుగా చెబుతున్నారు. అయితే మామిడి గోవిందరావు కూడా తక్కువ నేత కాదని అంటున్నారు. ఆయనకు టికెట్ దక్కకపోతే ఏమి చేస్తారు అన్నదే ఇపుడు చర్చగా ఉంది. చంద్రబాబు అయితే పాతపట్నంలో టీడీపీ కచ్చితంగా ఈసారి గెలవాల్సిందే అని అంటున్నారు. పార్టీ నేతలు అంతా ఐక్యంగా పనిచేయాలని కోరుతున్నారు. ఏది ఏమైనా గ్రాఫ్ పెరిగి కూడా టీడీపీ వర్గ పోరుతో సతమతం అవుతూంటే రెండు సార్లు గెలిచిన వైసీపీలో అదే సీన్ కనిపిస్తోంది. ఈ నేపధ్యంలో ఈసారి పాతపట్నంలో ఏ పార్టీ నుంచి ఎవరికి టికెట్ ఇచ్చినా సొంత వారితో కూడా గట్టిగా పోరాటం చేయాల్సి ఉంటుందని అంటున్నారు. పాతపట్నం లో వైసీపీ జెండా మళ్ళీ ఎగరేసి హ్యాట్రిక్ విజయం కొట్టాలని ఆ పార్టీ చూస్తోంది. వైసీపీ వర్గ పోరు టీడీపీకి అడ్వాంటేజ్ అయితే టీడీపీలో టికెట్ పోరుని తమకు అనుకూలం చేసుకోవాలని వైసీపీ చూస్తోంది. మరి అటూ ఇటూ జంపింగ్స్ ఏమైనా ఉంటాయా అన్నది చూడాలి. అలా పాతపట్నంలో పాత రొటీన్ రాజకీయమే సరికొత్తగా కనిపించే పరిస్థితులు అయితే ఉన్నాయని అంటున్నారు.

# ఈ నాలుగేళ్లలో అద్భుతాలు సృష్టించాం



శ్రీకాకుళం: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శనపై మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు స్పందించారు. ప్రాజెక్టుల దగ్గరకు వచ్చేటప్పుడు చంద్రబాబు కనీస అవగాహనతో వచ్చి ఉంటే బాగుండేదని సూచించారు. మంత్రి ధర్మాన మీడియాతో మాట్లాడారు. "14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఎవరిని ప్రశ్నించాలి. ప్రాజెక్టుల నిర్లక్ష్యానికి మీరు బాధ్యులు కాదా?, 14 ఏళ్లు సీఎంగా ఒక్క ప్రాజెక్టు పూర్తి చేశానని చెప్పగలరా?, నాలుగేళ్ల క్రితం ఏర్పడిన ప్రభుత్వంపై నిందలు వేస్తారా?, వంశధార 77 శాతం పనులు పూర్తయ్యాయి. డిసెంబర్‌లో జాతికి అంకితం చేస్తాం." అని మంత్రి తెలిపారు. "టీడీపీ హయాంలో వంశధార కేవలం 23 శాతం పనులు మాత్రమే చేశారు. ఒడిస్సాతో ఉన్న వివాదం పరిస్కారానికి సీఎం జగన్ (%జవీ యిుస్త్రుఅ%) అక్కడి ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపారు. టీడీపీ హయాంలో ఒడిస్సాతో ఉన్న వివాదానికి పరిస్కారం ఆలోచించారా?, ఉద్దానం సమస్య పరిస్కారానికి చంద్రబాబు ఏం చేశారు?, కిడ్నీ వ్యాధుల నిర్మూలణకు వంశధార నుంచి ఉద్దానంకు మంచినీరు అందించాలని కృషి చేశాం. నాలుగేళ్లలో ఒక్క కిడ్నీ సమస్య బయటకు రాలేదు. అబబద్ధాలకు ఒక హద్దు ఉండాలి. టీడీపీ ప్రభుత్వంలో శ్రీకాకుళం జిల్లాకు ఒక్క జాతీయ సంస్థ తెచ్చారా?, సిక్కోలుపై ప్రేమ ఉన్నట్టు చంద్రబాబు మాట్లాడుతున్నారు. తోటపల్లి 90 శాతం పనులు రాజశేఖర్ రెడ్డి పూర్తి చేశారు. కేవలం దోపిడీ కోసమే నదుల అనుసంధానం. ఉత్తరాంధ్రలో ఒక్క పని చేశామని చంద్రబాబుకు చెప్పమనండి. మళ్లీ అధికారంలోకి వస్తే వంశధార నిర్వాసితులకు న్యాయం చేస్తామంటున్నారు. విధ్వంసం అనే మాటను చంద్రబాబు ఉపసంహరించుకోవాలి. నాలుగేళ్లలో అద్భుతాలు సృష్టించాం. టీడీపీ ప్రభుత్వంలో అన్నీ బోకు పనులే. నీరు చెట్టు పేరుతో దోపిడీ చేశారు. చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మరు. గతంలో విద్యుత్ చార్జీలు ఎందుకు తగ్గించలేదు. అధికారంలోకి వస్తే చంద్రబాబు విద్యుత్ చార్జీలు తగ్గిస్తాడట. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి చంద్రబాబు. ప్రాజెక్టులపై ఇన్వెస్ట్మెంట్ దండగ అన్న వ్యక్తి బాబు. ఆయన మనసులో మాట పుస్తకంలో ఉంది." అని మంత్రి గుర్తుచేశారు.

# 10 మంది తెలుగు పోలీసులకు కేంద్ర హోంశాఖ మెడల్స్



న్యూఢిల్లీ: 2023 సంవత్సరానికి గానూ దేశవ్యాప్తంగా 140 మంది పోలీసు అధికారులు కేంద్ర హోంశాఖ అందించే ఇన్వెస్టిగేషన్‌లో ఎక్సలెన్స్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డు పొందిన వారి జాబితాను కేంద్ర హోంశాఖ శనివారం ప్రకటించింది. ఇక ఈ ఏడాది అవార్డులు అందుకున్న వారిలో సీబీఐ నుంచి 15 మంది, ఎన్ఐ నుంచి 12 మంది, ఉత్తరప్రదేశ్ నుంచి 10 మంది, కేరళ, రాజస్థాన్ నుంచి తొమ్మిది మంది చొప్పున, తమిళనాడు నుంచి 8, మధ్యప్రదేశ్ నుంచి ఏడుగురు, గుజరాత్ నుంచి ఆరుగురితోపాటు ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారు ఉన్నారు. కాగా వీరిలో 22 మంది మహిళా పోలీసులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పది మంది పోలీసులకు మెడల్స్ లభించాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి అయిదుగురు, తెలంగాణ నుంచి అయిదుగురు పోలీసు అధికారులకు కేంద్ర హోంశాఖ ఎక్సలెన్స్ మెడల్ దక్కాయి. **ఏపీ నుంచి..** గుంట్రెడ్డి అశోక్ కుమార్, ఇన్‌స్పెక్టర్, షేక్ మన్సూరుద్దీన్, ఇన్‌స్పెక్టర్, ధనుంజయుడు మల్లెల, డీఎస్పీ, కొర్లకుంట సుప్రజ, డీఎస్పీ, ఉప్పుటూరి రవిచంద్ర, డీఎస్పీ. **తెలంగాణ నుంచి..** మేకల తిరుపతన్న, అడిషనల్ ఎస్పీ, రాజుల సత్యనారాయణ రాజు, డీఎస్పీ, మూల జితేందర్ రెడ్డి, ఏసీపీ, కమ్మాపల్లి మల్లిఖార్జున కిరణ్‌కుమార్, డీఎస్పీ, భూపతి శ్రీనివాసరావు, ఏసీపీ కాగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ అందించే ఈ పతకాన్ని 2018లో ఇవ్వడం ప్రారంభించగా.. ప్రతి ఏడాది ఆగస్టు 12వ తేదీనా ప్రకటిస్తారు. నేర పరిశోధనలో ఉన్నత వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహించడం, విచారణలో వారి ప్రతిభను గుర్తించి గుర్తించి ఈ అవార్డు అందిస్తారు.


# వైసీపీ పనైపోయిందని సర్వేలు చెబుతున్నాయి



అమరావతి: వైసీపీ పని అయిపోయిందని, ఆ పార్టీకి సింగిల్ డిజిట్ ఖాయమంటూ సర్వేలన్నీ చెబుతున్నాయని టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు. అందుకే జగన్ రెడ్డి వై నాట్ 175 అని అంటున్నారని.. ఇప్పుడు తన తప్పులను క్షమించండని అంటున్నారని అన్నారు. బొత్సా కోతలు కోస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా గెలవరని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే వైసీపీ నుంచి 50 మంది ఎమ్మెల్యేలు వచ్చే ఎన్నికలలో టీడీపీ టికెట్ కోసం అధిష్టానంతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. అందులో విజయనగరం బొత్సా కుటుంబంలో వారూ ఉన్నారన్నారు.

బొత్సా వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన గెలవవు గెలిస్తే గుండు చేయిచుకొంటానని అంటున్నారని తెలిపారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమే.. విజయనగరంలో వైసీపీకి ఒక్క సీటు రాదని.. ఎన్నికల తరువాత వైసీపీ గుండు కాదు ఉరి వేసుకొనే ఫలితాలు వస్తాయని బోండా ఉమా విరుచుకుపడ్డారు.

# పవన్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి



విజయవాడ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై సీపీఐ రామకృష్ణ తనదైన శైలిలో స్పందించారు. కేంద్రానికి చెప్పి సీఎం జగన్ సంగతి తేలుస్తానన్న పవన్ వ్యాఖ్యలు ఆశ్చర్యంగా ఉన్నాయని తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడారు. "మోదీ సహకారం లేకుండా సీఎం జగన్ ఇన్ని దారుణాలు చేయగలరా?, బాబాయ్ హత్య కేసులో అరెస్టులు ఉండవు. జగన్‌పై కేసుల్లో విచారణ ఎందుకు సాగడం లేదు. జగన్.. మోదీ కాళ్ల మీద పడి మొక్కుతున్నారు. మోదీకి మద్దతుగా పార్లమెంటులో జై కొడుతున్నారు. బీజేపీ, వైసీపీకి పెళ్లి కుదరలేదు.. కానీ సంసారం చేస్తున్నారు. ఆర్బీఐ, కేంద్రం సహకారం లేకుండా ఇన్ని అప్పులు జగన్ తేగలరా?, ఈ విషయాలు చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతారు. పవన్ కళ్యాణ్‌కి ఇవి తెలియకుండా ఎలా మాట్లాడతారు. కేంద్రం దగ్గర పవన్‌కి పలుకుబడి ఉంటే జగన్ అక్రమాలపై విచారణ చేయించు. పోలవరం పూర్తి చేయించు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపించు. బీజేపీ, వైసీపీ అపవిత్ర కలయిక గురించి చంద్రబాబు, పవన్‌కి తెలుసు కదా?, ఢిల్లీలో మోదీకి జగన్, ఏపీలో జగన్‌కి మోదీ మద్దతు అనేది నిజం. రాష్ట్ర బీజేపీ నేతలకు మాత్రం ప్రతిపక్ష నాయకులుగా నటించమని పెద్దలు చెప్పారు. ఒక్క బిల్లులోనైనా జగన్.. మోదీ నిర్ణయాన్ని వ్యతిరేకించారా?, జగన్ ఇన్ని దారుణాలు చేసినా, వివేకాను హత్య చేసినా సీబీఐ ఏం చేస్తుంది. మోదీ, అమిత్ షాల కనుసన్నల్లో జగన్ పని చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ కూడా బీజేపీ నాటకాలను గుర్తిస్తే మంచిది." అని రామకృష్ణ సలహా ఇచ్చారు.

# 'హర్ ఘర్ తిరంగా' విజయవంతం చేయాలి.. నేతలకు పురందేశ్వరి పిలుపు



అమరావతి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ నేతలతో ఆ పార్టీ రాష్ట్ర అధినేత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి వర్చువల్ విధానంలో శనివారం సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌ల సమస్యలపై పోరాటం బాగా చేశారంటూ నేతలకు అభినందనలు తెలియజేశారు. జనసేన, బీజేపీ పొత్తు సంకేతాలు బలంగా వినిపించాలని పురందేశ్వరి సూచించారు. ఇంటింటికి త్రివర్ణ పతాక కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేద్దామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మూడు రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని.. ఈనెల 14న విభాజిత్.. విభీషణ్ కార్యక్రమం చేపట్టాలని నేతలకు తెలియజేశారు. డాక్యుమెంటరీ ప్రదర్శనతో పాటు రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శనను బీజేవైఎం ఆధ్వర్యంలో విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈవిధంగా హర్ ఘర్ తిరంగా, విభాజిత్ – విభీషణ్ జాతీయ స్థాయిలో చేస్తున్నారని తెలిపారు. ఏపీలో ఈ కార్యక్రమాలు విజయవంతం చేసేలా అందరూ పని చేయాలని నేతలకు పురందేశ్వరి ఆదేశాలు జారీ చేశారు.

# సొగసులను చేతులతో బంధించి కవ్విస్తున్న కియారా..!

బాలీవుడ్ సూపర్ హాట్ బ్యూటీల్లో కియారా ఒకరు. ఈ బ్యూటీ కి కేవలం బాలీవుడ్ లో మాత్రమే కాదు, టాలీవుడ్ లోనూ సూపర్ క్రేజ్ ఉంది. మహేష్ భరత్ అనే నేను సినిమాతో తొలిసారి తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆ తర్వాత వెంటనే వినయ విధయ రామ లోనూ ఛాన్స్ దక్కించుకుంది. కొంచెం గ్యాప్ ఇచ్చి,, మళ్లీ గేమ్ ఛేంజర్ మూవీలో రామ్ చరణ్ పక్కన నటిస్తోంది. కాగా, తన చేతిలో ఎన్ని సినిమాలు ఉన్నా, తాను ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్ ని మెప్పించకుండా మాత్రం ఉండదు. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా తనలోని గ్లామర్ డోస్ మరింత పెంచి, కొన్ని ఫో



టోలు షేర్ చేసింది. మల్టీ కలర్ మెర్మైడ్ డ్రెస్ లో మెరిసిపోయింది. ఈ డ్రెస్ లో కొన్ని ఫోటోల్లో తన సోకులను చేతులతో బంధించే ప్రయత్నం చేసింది. అయినా, ఈ సొగసులు మరింత కవ్వించేలా కనిపిస్తుండటం విశేషం. ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట అభిమానులను విపీరతంగా ఆకట్టుకుంటున్నాయి. లైకుల వరద, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఈ సంగతి పక్కన పెడితే, బాలీవుడ్ లోనూ కియారా దూసుకుపోతోంది. వరసగా అవకాశాలు అందుకుంటోంది.

అక్కడ ఇటీవల కార్తీక్ ఆర్యన్ తో కలిసిసత్య ప్రేమ్ కి కథ లో నటించింది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీ తర్వాత ఆమెకు అక్కడ మరిన్ని సినిమాలు చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే, బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాని ప్రేమించి పెళ్లాడిన ఈ బ్యూటీ, దక్షిణాదిన పాగా వేయడానికి ప్రయత్నిస్తోంది. రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ మూవీ క్లిక్ అయితే, కియారాకు దక్షిణాదిన మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం స్పష్టంగా ఉంది. మరి, గేమ్ ఛేంజర్ ఆమె కెరీర్ ఏ మేర ఛేంజ్ చేస్తుందో చూడాలి.

# పెళ్లి గురించి ఇలియానా అప్పుడే హింట్ ఇచ్చిందా?

గోవా బ్యూటీ ఇలియానా గత కొంత కాలంగా తన అభిమానులతో పాటు అందరిని కూడా సస్పెన్స్ లో ఉంచింది. తాను గర్భంతో ఉన్న విషయాన్ని ప్రకటించింది కానీ.. తాను పెళ్లి చేసుకున్నాను లేదా తాను రిలేషన్ లో ఉన్నాను అనే విషయాన్ని వెల్లడించలేదు. సరే గర్భం దాల్చింది కనుక రిలేషన్ లో ఉండి ఉంటుందని అనుకున్నా.. గత కొన్ని నెలలుగా ఇలియానా గురించి మీడియాలో ప్రముఖంగా చర్చ జరుగుతూనే ఉంది. ఇలియానా సోషల్ మీడియాలో తన బేబీ బంప్ తో కనిపించిన ప్రతి సారి కూడా ఆ బిడ్డకు తండ్రి ఎవరై ఉంటారు.. ఇలియానా తో ప్రేమలో ఉన్న ఆ



వ్యక్తి ఎవరై ఉంటారు అంటూ అంతా మాట్లాడుకుంటూ ఉండగా ఇటీవల ఇలియానా తన ప్రియుడిని పరిచయం చేసింది. అతడు ప్రియుడు మాత్రమే కాదు తన భర్త అని కూడా వెల్లడించింది. మే 13వ తారీకున ఇలియానా మైఖేల్ డోలన్ ను సన్నిహితుల సమక్షంలో పెళ్లి చేసుకుంది. పెళ్లి రోజు ఇలియానా సోషల్ మీడియాలో వైట్ డ్రెస్ తో ఉన్న ఒక ఫోటోను షేర్ చేసి తన పెళ్లి అన్నట్లుగా హింట్ ఇచ్చింది కానీ ఎవరు కూడా కనిపెట్టలేకపోయారు. ఆ రోజు పెళ్లి గురించి ఇలియానా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఆమె పెళ్లి విషయం పై ఏ ఒక్కరు కూడా ఊహించలేకపోయారు. మొత్తానికి ఇలియానా వ్యవహారం కు తెర పడినట్లు అయింది. కొడుకుకు జన్మనిచ్చిన ఇలియానా హీరోయిన్ గా మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి.




# 'గాండీవధారి అర్జున' ట్రైలర్- వరుణ్ తేజ్ ఫుల్ యాక్షన్ మోడ్



డిఫరెంట్ కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. చివరగా ఎఫ్3 సినిమాతో హిట్ అందుకున్న ఆయన వరసగా సినిమాలను లైన్?లో పెడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో 'గాండీవధారి అర్జున' అనే భారీ యాక్షన్ సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్ దగ్గరపడింది. ఆగస్టు 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ప్రమోషన్స్?లో జోరు పెంచిన మూవీటీమ్?.. రీసెంట్?గా ఓ చిన్న టీజర్ గ్లింప్స్?ను విడుదల చేయగా అది బాగా ఆకట్టుకుంది. ఇప్పుడు తాజాగా ట్రైలర్?ను విడుదల చేసింది. "డిసెంబర్? 2020లో దేవుడు మీద మనిషి గెలిచాడట. జస్ట్ పాతికవేల సంవత్సరాలలో మనిషి చేసిన వస్తువులు దేవుడు చేసిన వాటిని మించేసాయంట. ఎలాగో తెలుసా..?" అంటూ నాజర్ సంభాషణలతో ట్రైలర్ ప్రారంభమైంది. ఈ క్రమంలోనే దేశ రక్షణ విషయంలో తలెత్తిన ఓ పెద్ద సమస్య తలెత్తడం. 'ఏజెన్సీలో ఇంకెవరు లేరా?.. అనగానే.. 'ఏజెన్సీలో చాలా మంది ఉన్నారు. కానీ క్లైంట్? కోసం బులెట్? తీసుకునే వారు అర్జున్? ఒక్కడే' అన్నప్పుడు వరుణ్? తేజ్? ఎంట్రీ ఇవ్వడం, ఆ తర్వాత ' క్లైంట్ అయినా సరే తప్పు చేస్తే చంపేస్తా..' అంటూ వరుణ్? అనడం అంత స్పీడ్? స్పీడ్?గా సాగిపోయింది. ఫైనల్?గా 12 వేల మంది చనిపోయారంటూ.. దేశ రక్షణ విషయంలో తలెత్తిన ఓ పెద్ద సమస్యను అర్జున్? ఎలా పరిష్కరించాడు? దేశాన్ని ఎలా కాపాడాడు? ఈ క్రమంలో అతడికి ఎదురైన సవాళ్లేమిటి? ఇంతకీ అతడు చేపట్టిన ఆపరేషన్ వెనకున్న లక్ష్యమేమిటి? అనేది ట్రైలర్ ఆద్యంతం చూపించారు. వీటన్నింటికీ సమాధానాలు దొరకాలంటే తెరపై చూడాల్సిందే. ఇక ఈ ప్రచార చిత్రంలో వరుణ్‌తేజ్ స్టైలిష్ లుక్స్ చాలా బాగున్నాయి. బాగా ఇంటెన్సివ్?గా యాక్ట్? చేశారు. మొత్తంగా ఈ ట్రైలర్? యాక్షన్ సన్నివేశాలతో ఉత్కంఠగా సాగింది. దర్శకుడు ప్రవీణ సత్తార్? తన మార్క్? టేకింగ్?ను అద్భుతంగా చూపించారు. చివరిగా వరుణ్?.. 'ప్రపంచానికి నిజం తెలియాలి?', నాజర్?.. 'భూమికి పట్టిన అతి పెద్ద క్యాన్సర్? మనిషేనేమో' అంటూ ప్రచార చిత్రాన్ని ముగించారు. ఇక ఈ చిత్రంలో సాక్షివైద్య కథానాయికగా నటించింది.

# హరిహర వీరమల్లు.. ఇది గుడ్ న్యూసే..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన సినిమా కెరియర్లో మొదటిసారి ఒక డిఫరెంట్ హిస్టారికల్ కథను సెలెక్ట్ చేసుకోవడంతోనే అందరిని ఆశ్చర్యపరిచాడు. హరిహర వీరమల్లు సినిమాపై ఫ్యాన్స్ దృష్టి మరింత ఎక్కువగా పడింది. అందులోనూ టాలెంటెడ్ దర్శకుడు ఆ సినిమాను డైరెక్ట్ చేస్తున్నాడు అనగానే మార్కెట్లో కూడా ఆ సినిమాకు మంచి డిమాండ్ అయితే ఏర్పడింది. మొదట పాన్ ఇండియా రేంజ్ లో సినిమాను మొదలుపెట్టారు. అంతేకాకుండా ఫస్ట్ లుక్ టీజర్ కూడా పరవాలేదు అనే విధంగా ఆకట్టుకుంది. ఇక చార్మినార్ సెట్, అలాగే మరికొన్ని చారిత్రాత్మక నేపథ్యంలోనే కోటలు హైలైట్ అయ్యేలా సెట్లు కూడా వేశారు. ఇక మార్షల్ ఆర్ట్స్ లో కూడా పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవడం కూడా సినిమాపై ఎప్పటికప్పుడు పాజిటివ్ వైబ్రేషన్స్ అయితే క్రియేట్ అవుతూ వచ్చాయి. కానీ పవన్ కళ్యాణ్ మళ్లీ రాజకీయాలతో బిజీ కావడం వలన ఆ సినిమాకు బ్రేకులు పడుతూనే ఉన్నాయి. అంతేకాకుండా మధ్యలో కొన్ని స్క్రిప్ట్స్ విషయంలో మార్పులు చేర్పులు చేస్తున్నారు అని కూడా గాసిప్స్ అయితే వచ్చాయి.

ఏదేమైనప్పటికీ కూడా సినిమా మేకింగ్ ఆలస్యం అవుతున్న కొద్ది నిర్మాత ఏం రత్నం కొంత ఆర్థికంగా కూడా ఇబ్బంది పడినట్లు టాక్ కూడా వచ్చింది. సాధారణంగా ఇంత ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఒక నిర్మాత అంత భారీ బడ్జెట్ సినిమాను హ్యాండిల్ చేయడం అంటే రిస్కుతో కూడుకున్న పని. ఇక పవన్ బిజీ షెడ్యూల్ను అర్థం చేసుకుని అప్పటికి వాళ్ళు షూటింగ్స్ కొనసాగించినప్పటికీ అనుకున్న సమయానికి పనులు మాత్రం పూర్తి కావడం లేదు. అయితే ఈ సినిమా ఆగిపోవచ్చు అనే విధంగా కూడా అనుమానాలు వచ్చాయి. ఇక పరిస్థితులు ఎలా ఉన్నా కూడా నిర్మాత ఏం రత్నం మాత్రం పవన్ కళ్యాణ్ తో చాలా పాజిటివ్ గానే ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆయన బ్రో సినిమా వేడుకలు పాల్గొనడం అలాగే భోళా శంకర్ ఈవెంట్లో కూడా ఒక అతిథిగా రావడంతో ఎక్కడ కూడా విభేదాలు లేవని, హరిహర వీరమల్లో ప్రస్తావన తీసుకురాక పోయినప్పటికీ కూడా ప్రాజెక్టు మాత్రం ఉంటుంది అనేలా సంకేతాలు అయితే ఇచ్చారు. ప్రొడ్యూసర్ ఆ విధంగా ఉన్నప్పటికీ దర్శకుడు క్రిష్ మాత్రం ఎక్కడా కూడా బయట హరిహర వీరమల్లు గురించి పెద్దగా రియాక్ట్ అవడం లేదు. అంతేకాకుండా ఈ మధ్య ఆయన ఒక యువ హీరోతో సినిమా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు కూడా టాక్ వచ్చింది. ఇక ఇప్పుడు పవన్ కళ్యాణ్ రాజకీయాలతో మరింత బిజీగా ఉన్నాడు. మరి హరిహర వీరమల్లో మళ్ళీ ఎప్పుడు సెట్స్ పైకి వస్తుందో కాలమే సమాధానం చెప్పాలి.

# రష్మికని టాలీవుడ్ లైట్ తీసుకుందా..?

కన్నడ భామ రష్మిక మందన్న టాలీవుడ్ లో దూకుడు తగ్గించిందని చెప్పొచ్చు. మొన్నటిదాకా వరుస స్టార్ ఛాన్స్ లతో ఊగిపోయిన అమ్మడు ఇప్పుడు అవకాశాలు లేక ఖాళీగా ఉంది. అయితే తెలుగులో చేయకపోయినా బాలీవుడ్ లో సినిమాలు చేసిన రష్మిక ఇప్పుడు అక్కడ కూడా ఆఫర్లు రాకపోవడంతో మళ్లీ టాలీవుడ్ బాట పట్టింది. రష్మిక ప్రస్తుతం సందీప్ వంగా డైరెక్షన్ లో వస్తున్న యానిమల్ సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా తో పాటుగా అల్లు అర్జున్ పుష్ప 2 లో కూడా నటిస్తుంది. పుష్ప 1 సూపర్ హిట్ అవడంతో పుష్ప 2 పై అంచనాలు పెరిగాయి. అయితే పుష్ప 2 లో రష్మిక పాత్ర నిడివి చాలా తక్కువ ఉంటుందని తెలుస్తుంది. ఈ సినిమా తర్వాత రీసెంట్ గా రెయిన్ బో అని ఒక పాన్ ఇండియా ఫిమేల్ సెంట్రిక్ సినిమాను ఓకే చేసింది అమ్మడు. ఆ సినిమాల తర్వాత మరో ఆఫర్ రాలేదు.



ఈమధ్యనే నితిన్ సినిమాలో ఛాన్స్ వచ్చినట్టే వచ్చి చేజారింది. అసలు నితిన్ సినిమా నుంచి రష్మిక ఎందుకు బయటకు వచ్చిందన్న రీజన్ ఇంతవరకు బయటకు రాలేదు. అయితే కొందరు అదంతా పబ్లిసిటీ కోసమే తప్ప నితిన్ సినిమాలో రష్మిక చేస్తుందని అంటున్నారు. భీష్మ కాంబో లో వస్తున్న ఈ సినిమా మరోసారి ఆ మ్యాజిక్ రిపీట్ చేయాలని చూస్తున్నారు. అసలు టాలీవుడ్ నుంచి రష్మికకు ఆఫర్లు ఎందుకు రావట్లేదు అంటే కథ విషయంలో క్యారెక్టర్స్ విషయంలో రష్మిక వివరాలు అడుగుతుందట. అంతేకాదు రెమ్యునరేషన్ కూడా భారీగానే డిమాండ్ చేస్తుందని తెలుస్తుంది. అందుకే రష్మికని కాదని ఆమె ప్లేస్ లో కొత్త హీరోయిన్స్ ను.. ఇప్పుడు ఫాం లో ఉన్న కథానాయికలను తీసుకుంటున్నారు. ఎవరితో చేసినా చేయకపోయినా రష్మిక మళ్లీ విజయ్ తో కలిసి నటిస్తే చూడాలని ఆమె ఫ్యాన్స్ కోరుతున్నారు. నేషనల్ క్రష్ అయిన రష్మిక ఇలా సడెన్ గా చేతిలో సినిమాలు లేక ఖాళీ అవడం అందరిని షాక్ అయ్యేలా చేస్తుంది. ఓ పక్క రోజుకొక కొత్త హీరోయిన్ ఎంట్రీ ఇస్తున్న ఈ టైం లో ఆల్రెడీ ఫాం లో ఉన్న భామలు ఇలా సినిమాలకు బ్రేక్ ఇస్తే వారి గ్రాఫ్ తగ్గే ఛాన్స్ ఉంటుంది. ఆ విషయాన్ని గుర్తించి హీరోయిన్స్ వరుస సినిమాలు చేస్తే బాగుంటుందని చెప్పొచ్చు.

# చీర కట్టులో 'చిట్టి' అందం

జాతిరత్నాలు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయిన తెలుగు ముద్దుగుమ్మ ఫరియా అబ్దుల్లా మొదటి సినిమాతోనే మంచి మార్కులు దక్కించుకుంది. హీరోయిన్ గా ఈ అమ్మడికి వరుస ఆఫర్లు వస్తాయని అంతా భావించారు. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఈ అమ్మడు మెల్ల మెల్లగా సినిమాల్లో నటిస్తూ వస్తుంది. ఆ మధ్య రవితేజ సినిమాలో నటించిన ఫరియా అబ్దుల్లా ప్రస్తుతం రెండు మూడు సినిమాల్లో నటిస్తోంది. ఈ అమ్మడు సినిమాల్లో తక్కువ నటించినా సోషల్ మీడియాలో ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. ఈమె రెగ్యులర్ గా ఏదో ఒక కార్యక్రమంకు హాజరు అవ్వడంతో పాటు.. ఏదో ఒక



ఫోటో షూట్ తో హడావిడి చేస్తూ వస్తోంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు చీర కట్టు తో అలరించింది. ఈసారి చీర కట్టు ఫోటోలతో కన్నుల విందు చేసింది. సాధారణంగా హీరోయిన్స్ చీర కట్టులో కనిపిస్తే చాలు నెటిజన్స్ ఫిదా అవుతూ ఉంటారు. ఇక ఫరియా వంటి హాట్ బ్యూటీస్ చీర కట్టులో కనిపిస్తే ఇంకేమైనా ఉందా... ఈ ఫోటోలు అందుకు సాక్ష్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ వస్తున్నాయి. జాతిరత్నాలు సినిమాలో చిట్టిగా మెప్పించిన ఈ అమ్మడు ఇంకా కూడా చిట్టిగానే ప్రేక్షకులతో పిలిపించుకుంటుంది. ఫరియా అబ్దుల్లా ఇలాంటి హాట్ అండ్ క్యూట్ ఫోటోలతో అలరిస్తే తప్పకుండా ముందు ముందు మరిన్ని మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



# నిజాం కాలేజీలో చదువుకోవడం గర్వంగా ఉంది..: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: నిజాం కాలేజీలో చదువుకున్నందుకు గర్వంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. 1993 నుంచి 96 వరకు ఈ కాలేజీలో చదువుకున్నానని, ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ విద్యార్థి జీవిత జ్ఞాపకాలు గుర్తుకొస్తాయని చెప్పారు. కాలేజీకి గొప్ప పేరుందన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు తాను నిజాం కాలేజీలో చదువుకున్నట్లు గొప్పగా చెబుతానని వెల్లడించారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో బాయ్స్ హాస్టల్, న్యూ కాలేజ్ బ్లాక్‌కు మంత్రులు సబిత ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీతో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. యూనివర్సిటీల పరంగా తెలంగాణకు నాలుగవ ర్యాంకు రావడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో ఓయూ అభివృద్ధి కోసం ప్రభుత్వం పాటుపడుతున్నదని చెప్పారు. వర్సిటీ వీసీ రవీందర్ కూడా ఓయూ అభివృద్ధి కోసం మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను భాగస్వాముల చేసేలా ప్రారంభించిన కార్యక్రమం బాగుందన్నారు. తెలంగాణ టీశాట్‌తో కలిసి ఉస్మానియా టీవీ ఏర్పాటు చేయడం ద్వారా మారుతున్న పరిస్థితులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా విద్యను మరింతమందికి అందించేలా ప్రయత్నం చేయడం స్వాగతించదగిన విషయమని చెప్పారు. తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వనన్న గత సీఎం కిరణ్ కుమార్ రెడ్డి.. నిజాం కాలేజీ కోసం నిధులు ఇవ్వలేదని విమర్శించారు. ఆయన కూడా నిజాం కాలేజీ విద్యార్థేనని గుర్తుచేశారు. గతంలో ఈ కాలేజీలో డిగ్రీ చదువుతున్న బాలికలకు హాస్టల్ వసతి లేకపోవడంతో వెంటనే నిర్మాణం చేసి, ప్రారంభించుకున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పేద విద్యార్థులకు వసతి సౌకర్యం ఉండాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. విద్యాశాఖకు నిధులకు అదనంగా పురపాలక శాఖలోని హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.40.75 కోట్లు ఇచ్చామన్నారు. నేడు బాయ్స్ హాస్టల్‌తోపాటు అదనపు తరగతి గదులను నిర్మించుకోబోతున్నామని తెలిపారు. వచ్చే 15 నెలల్లో భవనాల నిర్మాణాలను పూర్తిచేస్తామన్నారు. కాలేజ్ గ్రౌండ్‌కు ఇబ్బంది రాకుండా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిర్మాణం కోసం మా నిధుల తోపాటు మంత్రి కేటీఆర్ [illegible] నిధులు కూడా ఇచ్చినందుకు కేటీఆర్‌కు మంత్రి సబిత ఇంద్రారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మొదటిసారి నిజాం కాలేజ్ డిగ్రీ విద్యార్థులకు కూడా హాస్టల్ కల్పించామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించారని, యూనివర్సిటీల కోసం 500 కోట్లు ముఖ్యమంత్రి కేటాయించారని వెల్లడించారు. గురుకులాలు ఏర్పాటు చేసిన తర్వాత ఉన్నత విద్యలో అమ్మాయిల సంఖ్య పెరిగిందని చెప్పారు. కల్యాణ లక్ష్మితో వచ్చిన డబ్బును కొంతమంది అమ్మాయిలు ఉన్నత చదువుల కోసం వాడుకుంటున్నారని తెలిపారు.



# హైదరాబాద్ ఔటర్ ప్రైవేటుచేతికి వెళ్లిపోయింది.. 30 ఏళ్లు ఐఆర్ బీకే!

హైదరాబాద్ : ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ముప్పై ఏళ్ల పాటు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును "ఐఆర్ బీ" అనే సంస్థకు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించటం.. దీనికి సంబంధించిన లాంఛన కార్యక్రమం శుక్రవారం అర్థరాత్రి జరిగింది. దీంతో.. ఈ రోజు (ఆగస్టు 12, 2023) నుంచి మరో ముప్పై ఏళ్ల పాటు ఈ సంస్థ చేతిలో ఉండనుంది. ఔటర్ రింగు రోడ్డు టోల్ ప్రైవేటు చేతుల్లోకి వెళ్లటంపై విపక్షాలు పెద్ద ఎత్తున అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. టెండర్ లో భాగంగా రూ.7380 కోట్ల మొత్తానికి ఐఆర్ బీ సంస్థ చేతికి అప్పజెప్పటం.. తన చేతుల్లోకి వచ్చిన క్షణం నుంచి టోల్ వసూలు ప్రక్రియను సదరు సంస్థ షురూ చేసింది. శుక్రవారం అర్థరాత్రి 12 గంటల వరకు ఈగిల్ ఇన్ ఫ్రా ఇండియా లిమిటెడ్ పేరిట టోల్ రుసుము రాగా.. 12 గంటలు దాటిన తర్వాత ఐఆర్ బీ గోల్కొండ ఎక్స్ ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రుసుము ఇవ్వటం షురూ చేశారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. ఈ టెండర్ ప్రక్రియ మీద పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగింది.అయినప్పటికీ ప్రభుత్వం వెనకడుగు వేయలేదు. కొత్త సంస్థ చేతికి ఔటర్ ను అప్పగించే ప్రక్రియకు సంబంధించిన అధికారిక ప్రకటన చేసి ఉన్నా బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ.. అలాంటిదేమీ లేకుండా నానక్ రామ్ గూడలో మాట్లాడిన కొద్దిమంది హెచ్ఎండీఏ అధికారుల సమక్షంలో ఔటర్ అప్పగింత కార్యక్రమం పూర్తి కావటం గమనార్హం. హైదరాబాద్ కు మణిహారంగా ఉన్న 158 కి.మీ. మేర నిర్మించిన ఐటర్ రింగ్ రోడ్డును ఇప్పటివరకుప్రభుత్వ అధీనంలోని హెచ్ఎండీఏ – హెచ్ సీఎల్ సంస్థ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఔటర్ పై ప్రస్తుతం రోజువారీగా రూ.1.55 కోట్ల నుంచి రూ.1.65 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. అంటే నెలకు రూ.45 కోట్ల మేర వస్తున్న ఆదాయం ఏడాదికి రూ.540 కోట్ల మేర వస్తోంది. ఈ నేపథ్యంలో టీవోటీ పద్ధతిలో 30 ఏళ్ల పాటు ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించి.. టెండర్లు పిలవటం.. ఐఆర్ బీఐ సంస్థకు రూ.7380 కోట్లకు ఇవ్వటంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. 30 ఏళ్లకు సంబంధించిన రూ.7380 కోట్ల భారీ మొత్తాన్ని గురువారం సదరు సంస్థ చెల్లించటం.. శుక్రవారం అర్థరాత్రి నుంచి ఆ సంస్థకు వసూళ్ల బాధ్యతను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏడిరోజులతో పోలిస్తే సెలవులు.. పండుగల సమయంలో ఔటర్ మీద ఆదాయం మరింత పెరుగుతుంది. బంగారు బాతుగుడ్డు లాంటి ఔటర్ ను ప్రైవేటుకు అప్పగించటాన్ని పలువురు తప్పు పట్టారు. ఒక అంచనా ప్రకారం పదేళ్ల వ్యవధిలోనే రూ.7వేల కోట్ల ఆదాయం వచ్చే ఔటర్ ను ముప్పై ఏళ్లకు రూ.7380 కోట్లకు ఇవ్వటంపై అభ్యంతరాలు వ్యక్తమైనా ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. తాను అనుకున్నట్లే టెండర్ లో అత్యధిక ధరను కోట్ చేసిన సంస్థకు ఇచ్చేసింది. ఓవర్ల టెండర్ ప్రక్రియకు సంబంధించిన వివరాల్ని మాత్రం వెల్లడించకపోవటం.. బేస్ ధర మీద గోప్యత పాటించటాన్ని టీపీసీసీ చీఫ్ రేవంత్ తీవ్రంగా తప్పు పట్టారు. తనకు అవసరమైన సమాచారాన్ని సమాచార హక్కుచట్టం కింద కోరినా ఇవ్వలేదంటూ కోర్టును ఆశ్రయించారు. ఆయనకు వివరాలు అందజేయాలని కోర్టు కూడా ఆదేశించింది. ఓవైపు ఈ వివాదం కొనసాగుతుండగా.. మరోవైపు శుక్రవారం అర్థరాత్రి వేళ గోప్యంగా ఐఆర్ బీ సంస్థకు ఔటర్ ను అప్పగించేయటం సంచలనంగా మారింది.

# కాంగ్రెస్ అంటే దొంగరాత్రి కరెంటు.. బీఆర్ఎస్ అంటే 24 గంటల ఉచిత కరెంట్: మంత్రి హరీశ్ రావు

సంగారెడ్డి: కాంగ్రెస్ అంటే దొంగరాత్రి కరెంటు.. బీఆర్ఎస్ అంటే 24 గంటల ఉచిత కరెంట్ అని మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూడలేని కాంగ్రెస్ నేతలు తిట్ల దండకం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఉచిత విద్యుత్‌ను ఉత్త విద్యుత్‌గా మార్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి 3 గంటల కరెంట్ ఇస్తే 3 ఎకరాల పొలం పారుతుందని చెప్పారు. రేవంత్‌రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. సంగారెడ్డిలో లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను, పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ పత్రాలను మంత్రి హరీశ్ రావు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఎందుకు లేదని నిలదీశారు. దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో గ్రామాల సమగ్రాభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు. 3 శాతం జనాభా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి 38 శాతం అవార్డులు రావడం ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరుకు నిదర్శనమని మంత్రి హరీశ్ అన్నారు. సోమవారం నుంచి రూ.99 వేల వరకు రుణమాఫీ చేయనున్నామని తెలిపారు. ఇచ్చిన మాటప్రకారం వచ్చే 15-20 రోజుల్లో రూ.లక్ష వరకు రుణ మాఫీ చేసి తీరుతామని వెల్లడించారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం



చేయడం సంతోషంగా ఉందన్నారు. కులవృత్తులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో బీసీ బంధు ఇస్తున్నామని చెప్పారు. వెనుకబడిన వర్గాలవారికి రూ.20 లక్షల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఇస్తున్నామని చెప్పారు. 35 వేల సెలూన్లు, 60 వేల లాండ్రీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాకముందు 19 బీసీ గురుకులాలు ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 310కి చేరిందన్నారు. బీసీల కోసం ప్రభుత్వం వంద కోట్లు ఖర్చుచేస్తున్నదని తెలిపారు.

# తన టికెట్ తానే అనౌన్స్ చేసుకున్న కవిత

నిజామాబాద్ : తన టికెట్ ను తానే ప్రకటించుకున్నారు ఎమ్మెల్సీ కవిత. బీఆర్ఎస్ లో మిగిలిన వారితో పోలిస్తే తాను భిన్నమన్న విషయాన్ని తాజా ప్రకటనతో ఆమె చెప్పేసుకున్నారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్న దానిపై అధినేత ప్రకటించటం మామూలే. అందుకు భిన్నంగా తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో తాను వచ్చే లోక్ సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తానన్న విషయాన్ని ఆమె స్పష్టం చేయటం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆమె పదవీ కాలం నవంబరు 2027 వరకు ఉన్న సంగతి తెలిసిందే. 2014 ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ స్థానానికి నాటి టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆమె.. బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్ చేతిలో పరాజయం పాలయ్యారు. అనంతరం ఆమెకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు. ఎమ్మెల్యేల కోటాలో తొలిసారి.. రెండోసారి స్థానిక సంస్థల కోటా నుంచి ఆమె ఎంపికయ్యారు. తాను చేపట్టిన ఎమ్మెల్సీ పదవి మీద కవిత ఏ మాత్రం ఇంట్రస్ట్ లేదన్న విషయం తెలిసిందే. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆమె.. "నేను ఇది వరకే చెప్పాను.. మీ అందరి సాక్షిగానే చెప్పాను.. అరవింద్ నీవు ఎక్కడ నిలబడ్డా.. వచ్చి నీ వెంటబడి ఓడిస్తా. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయన చెబుతున్నాడట. ఎంపీకి పోను.. ఎమ్మెల్యేగానే కోరుట్లలో పోటీ చేస్తానని అరవింద్ అంటుండట.. నేను ఎక్కడ పోను బిడ్డా.. నిజామాబాద్ పార్లమెంట్‌కు వస్తా.. కచ్చితంగా గెలుస్తా. నాది నిజామాబాద్.. నా సొంతూరు. నా అత్తగారి ఊరు" అని పేర్కొన్నారు. తాను బతికినా.. చనిపోయినా తాను నిజామాబాద్ ను వదిలేది లేదన్న కవిత.. "నేను ఇంతకుముందే చెప్పిన.. బతికున్నా.. చనిపోయినా..



రేపు నా కట్టే కాలేది కూడా నిజామాబాద్‌లోనే. కచ్చితంగా నిజామాబాద్ నుంచే పార్లమెంట్‌కు పోటీ చేస్తా. నేను పారిపోయేది లేదు. నువ్వే కోరుట్ల పోతా.. అక్కడ పోతా.. ఇక్కడ పోతా అని అంటున్నవట. కోరుట్లకు పో.. అక్కడకు కూడా వచ్చి నిన్ను ఓడిస్తా.

నువ్వు ఎక్కడన్న పో.. సర్పంచ్‌గా, ఎంపీటీసీ, ఎమ్మెల్యేగా పోటీ చేస్తవ.. నిన్ను వదిలిపెట్ట.. ఫస్ట్ వాగడం తగ్గించుకో" అంటూ ఫైర్ అయ్యారు. ఇన్ని మాటలు చెప్పిన కవిత.. తాను నిజామాబాద్ నుంచి అధినేత ఆశీస్సులతో పోటీ చేస్తానన్న ఒక్క మాట చెప్పి ఉంటే.. ఈ తలనొప్పులు ఉండేవి కాదు కదా? అన్న ప్రశ్న పలువురి నోట వినిపిస్తోంది. నిజమే కదా. శకునం చెప్పే బల్లి సామెత మాదిరి.. తన ప్రత్యర్థి ఎలా మాట్లాడాలో చెప్పే కవిత.. తాను మాట్లాడే సమయంలో మాత్రం దొరికిపోవటం గమనార్హం.

# శంషాబాద్‌లో దిశ తరహాలో హత్యకు గురైన మహిళ ఎవరో తెలిసిపోయింది..!




శంషాబాద్ : శంషాబాద్‌లో శంషాబాద్‌లో దిశ తరహాలో ఓ మహిళ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఇది తెలంగాణలో సంచలనం సృష్టించింది. అయితే.. మహిళ దారుణ హత్య కేసులో పోలీసులు కాస్త పురోగతి సాధించారు. హత్యకు గురైన మహిళ ఎవరో గుర్తించారు. శంషాబాద్‌లో దారుణ హత్యకు గురైన మహిళ మంజులగా పోలీసులు గుర్తించారు. మంజుల స్వస్థలం.. శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొడ్డి గ్రామం.

ఈ నెల 10 న కడుపులో నొప్పి వస్తుందని హాస్పిటల్‌కు వెళ్లేందుకు మంజుల బయటకు వచ్చింది. ఈ మేరకు శంషాబాద్ రూరల్ పోలీసులకు భర్త లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. నిందితుల కోసం పది బృందాలుగా ఎస్ఓటి పోలీసులు గాలిస్తున్నారు. పెట్రోల్ బంక్ లో రికార్డ్ అయిన సిసి విజువల్స్ ఆధారంగా నిందితుల కోసం గాలింపులు నిర్వహిస్తున్నారు. పెట్రోల్ బంక్‌లో ఐదు లీటర్ల డీజిల్ తీసుకున్న ఇద్దరు వ్యక్తులే నిందితులా? లేదంటే మరెవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# అజారుద్దీన్ మదిలో అసెంబ్లీ... టెన్షన్ లో మాజీ ఎమ్మెల్యే?



హైదరాబాద్ : కర్ణాటక ఎన్నికల అనంతరం కొత్త ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలోనూ సత్తా చాటాలని భావిస్తోంది. ఈ సమయంలో చేరికలతో, సరికొత్త ఎత్తులతో సందడి చేస్తోంది. ఈ సమయంలో టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ ఎంటరయ్యారు. అసెంబ్లీకి పోటీ చేస్తానని చెప్పారని తెలుస్తోంది. అవును... టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టాలని భావిస్తున్నారు. దీంతో ఒక నియోజకవర్గాన్ని కూడా ఎంపిక చేసుకున్నారని అంటున్నారు. దీంతో స్థానిక నేత అనుచరులు ఆందోళనలకు దుగుతున్నారు. అజారుద్దీన్ 2009 లో కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంటు సభ్యునిగా ఉత్తరప్రదేశ్ లోని మురాదాబాద్ నియోజకవర్గం నుండి గెలుపొందారు. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నేతగా అసెంబ్లీకి ఎన్నిక కావాలని కోరుకుంటున్నారు. ఇందులో భాగంగా... జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని తనకు తానుగా ప్రకటించుకున్నారని అంటున్నారు. అనంతరం జూబ్లిహిల్స్ నియోజకవర్గానికి వెళ్లిన అజారుద్దీన్ కు ఊహించని పరిణామాలు ఎదురయ్యాయి. ఈ సందర్భంగా నియోజకవర్గానికి వెళ్లిన ఆయన... నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి ప్రజలు కొత్త ముఖాన్ని కోరుకుంటున్నారంటూ ప్రకటన చేశారు. ఈ ప్రకటనే వివాదానికి కారణమైంది. దీంతో... జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి మద్దతుదారుల నుంచి నిరసన వ్యక్తం అయింది. జూబ్లీహిల్స్ తో తనకు 16 ఏళ్ల అనుబంధం ఉందని పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి చెబుతున్నారు. ఫలితంగా... విష్ణు మద్దతు దారులు అజాహరుద్దీన్ పర్యటనకు అభ్యంతరం చెప్పారు. పైగా... ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ పై జూబ్లీహిల్స్ నుంచి పోటీచేసి గెలవాలని విష్ణువర్ధన్ రెడ్డి భావిస్తున్నారు. ఇప్పటికే పీసీసీ పెద్దలతో మంతనాలు జరిపారని అంటున్నారు. ఇదే సమయంలో నియోజకవర్గంలో గతకొంతకాలంగా ఫుల్ యాక్టివ్ మోడ్ లోకి వచ్చారు. సరిగ్గా ఈ సమయంలో అజారుద్దీన్ ఎంటరయ్యారు. తాజాగా నియోజకవర్గ పరిధిలోని సోమాజీ గూడ, ఎర్రగడ్డ, బోరుబండ ప్రాంతాల్లో పర్యటించారు. పార్టీ కేడర్ తో కలిసి ఛాయ్ పే చర్చ నిర్వహించారు. స్థానికులతోనూ మమేకమయ్యే ప్రయత్నం చేసారు. దీంతో విష్ణు వర్గీయులు అజారుద్దీన్ పై ఫైరవుతున్నారు. ఇదే సమయంలో అజాహరుద్దీన్ ను సికింద్రాబాద్ ఎంపీగా బరిలోకి దింపాలని మరి కొందరు నేతలు సూచిస్తున్నారు. విష్ణు అనుచరులు మాత్రం ఈ కొత్త లొల్లి ఏందిరాబాయ్ అంటూ తలలు పట్టుకుంటున్నారని తెలుస్తోంది. మరి ఈ సమయంలో అధిష్టాణం పెద్దలు అజారుద్దీన్ ని ఒప్పిస్తారా.. లేక, విష్ణుని నొప్పిస్తారా.. అనేది వేచి చూడాలి!

# ధర్నాచౌక్.. కేసీఆర్ అబ్బ జాగీరు కాదు



హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ధర్నాచౌక్.. కేసీఆర్ అబ్బ జాగీరు కాదని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ మాదిరి సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో కేసీఆర్ పేదల నోట్లో మట్టి కొట్టారన్నారు. నిరుద్యోగుల డిమాండ్ మేరకు గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో అపార్ట్‌మెంట్లు వద్దని తుమ్మల నాగేశ్వరరావు, హరీష్ రావు, కడియం శ్రీహరి, నాలాంటోళ్ళం చెప్పినా కేసీఆర్ వినలేదన్నారు. తొమ్మిదేళ్ళ కాలంలో పేదల ఇళ్ళకు కేసీఆర్ సర్కార్ రూ.600 కోట్లు మాత్రమే కేటాయించిందని ఎమ్మెల్యే తెలిపారు. కట్టిన ఇళ్ళను పేదలకు పంచే ధైర్యం కేసీఆర్ సర్కార్‌కు లేదన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్ళు కట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్‌కు ఒక న్యాయం.. పేదలకు మరొక న్యాయం నడవదన్నారు. కేసీఆర్‌కు మరొక మూడు నెలల సమయం మాత్రమే ఉందన్నారు.

బీజేపీ అధికారంలోకి వచ్చాక.. పేదలు ఇళ్లు కట్టుకోవటానికి రూ.5లక్షల సాయం చేస్తామని హామీ ఇచ్చారు. మళ్ళీ కేసీఆర్‌కు అవకాశం ఇస్తే.. పేదల బతుకులు ఆగమే అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ చుట్టుప్రక్కల ఒక్క గజం భూమి అయినా.. పేదలకు ఇచ్చే ధైర్యం కేసీఆర్‌కు ఉందా అని ప్రశ్నించారు. బీజేపీని ఆశీర్వదిస్తే.. పేదలకు డబుల్ ఇళ్ళ కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ధర్నాచౌక్‌ను ఎత్తివేసిన చరిత్ర కేసీఆర్ ది అని ఈటల రాజేందర్ వ్యాఖ్యలు చేశారు.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం.. చల్లబడిన వాతావరణం

హైదరాబాద్: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. మాదాపూర్, కొండాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, బేగంపేట, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, లిబర్టీ, హిమాయత్‌నగర్ పలుచగా చినుకులు పడ్డాయి. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాబాద్‌లో కూడా వర్షం కురిసింది.

ఉదయం నుంచి నగరం మొత్తం మేఘావృతమై ఉన్నది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చిరుజల్లులు కురవడంతో గత వారం రోజులుగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల నుంచి నగర వాసులకు ఉపశమనం లభించినట్లయింది.



# తెలంగాణలో నడుస్తోంది వాటాల ప్రభుత్వం.. ప్రజలారా తస్మాత్ జాగ్రత్త

హైదరాబాద్: తెలంగాణలో 30 శాతం వాటాల ప్రభుత్వం నడుస్తోందని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 30 శాతం వాటాల ప్రభుత్వం మళ్ళీ వస్తే.. తెలంగాణలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. తెలంగాణ ప్రజలారా తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. భూములమ్మి ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నారని, అమ్మకాలపై ఆధాపడి కేసీఆర్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. బైఎలక్షన్స్‌లో ఈటలను ఓడించటం కోసమే దళితబంధు పథకం తీసుకొచ్చారన్నారు. దళితబంధు పేరుతో కేసీఆర్ దళితులను మోసం చేశారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి పేరుతో విద్యార్థులను దగా చేశారన్నారు.

పెట్రోల్, డీజిల్‌పై టాక్స్ తగ్గించని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పొదుపు సంఘాల ఉసురు పోసుకుంటున్నారన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో వాటాల ప్రభుత్వం నడుస్తోందని కేంద్రమంత్రి విరుచుకుపడ్డారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే డబుల్ బెడ్రూం ఇళ్లు...** తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ళు వస్తాయని అన్నారు. తొమ్మిదేళ్ళల్లో పేదలకు ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
నాలుగు నెలల్లో ప్రగతిభవన్ కట్టుకున్న కేసీఆర్‌కు పేదల ఇళ్ళపై చిత్తశుద్ధి లేదన్నారు. పేదల గొంతు కోయటం కల్వకుంట్ల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య అంటూ వ్యాఖ్యలు చేశారు. బలిదానాలతో వచ్చిన తెలంగాణ కేసీఆర్ పాలనలో దగా పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రం కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీ అయ్యిందన్నారు. తెలంగాణ సంపదను బీఆర్ఎస్ నాయకులు దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఏడు లక్షల కోట్ల అప్పులు చేశారని.. మాఫియాలు తెలంగాణను పాలిస్తున్నాయని మండిపడ్డారు. 35 లక్షల మందికి డబుల్ బెడ్రూం ఇళ్ళు ఇస్తామన్న కేసీఆర్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సొంత జాగ ఉంటే ఇల్లు కట్టుకోవటానికి డబ్బులిస్తామనటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర సర్కార్ పేదలకు ఇళ్లు కడితే.. కేంద్రం వాటాను తీసుకొచ్చే బాధ్యత తెలంగాణ బీజేపీ తీసుకుంటోందని తెలిపారు. నాలుగు నెలల తర్వాత కేసీఆర్ గద్దె దిగటం ఖాయమని స్పష్టం చేశారు. అసెంబ్లీ లోపల, బయట డబుల్ బెడ్రూం ఇళ్ళపై పేదలను మభ్యపెడుతున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com